అవిమారకము

చిలకమర్తి లక్ష్మీనరసింహం

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

అవిమారకము

నాటకము

రచయిత

చిలకమర్తి లక్ష్మీనరసింహం

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2007

AVIMARAKAMU

(Drama)

by

CHILAKAMARTHI LAKASHMINARASIMHAM

T.T.D. Religious Publications Series No:698

© All Rights Reserved

First Edition : 2007

Copies: 1000

Published by
A.P.V. Narayana Sarma, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati-517 501.

DTP by
M/S SAR Infotec (P) Ltd,
15-3-200,G.N.Mada Street,
Tirupati- 517501.

Printed at
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

ముందుమాట

సంస్కృత సారస్వతానికి సారభూతమైంది దృశ్య కావ్యం. దీనికి రూపకమని పేరు. నాటకం రూపక భేదాల్లో వినడం, చూడడం అనే కారణాల వల్లా, సర్వ కళల సమాహారం కావటం చేతా, దీని ప్రభావం సమాజం మీద అత్యధికం. అందువల్లనే ఆలంకారికులు "కావ్యేషు నాటకం రమ్యమ్", " నాటకాంతం హి సాహిత్యమ్" అని ఈ ప్రక్రియను ప్రశంసించారు.

సంస్కృతంలో ప్రప్రథమ నాటక కర్త భాస మహాకవి. "సంసార సుఖైక వాక్ప్రచుర చారువచస్సరసీరుహాక్షి" ఐన చదువుల తల్లి క్రొమ్ముడిలో భాసుడు అలంకారమని ఒక అజ్ఞాతకవీ,"భాసోహాసః"....అని ప్రసన్న రాఘవంలో జయ దేవకవీ ఇతణ్ణి ప్రస్తుతించారు. సహజత, శైలీ ప్రసన్నత, హృద్యత, మానసిక విశ్లేషణ అనే ప్రత్యేక గుణాలీ ప్రస్తుతికి కారణాలు.

భాసుడు తన నాటకాల్లో ఎక్కడా తన దేశకాలాల్ని గూర్చి గానీ, తల్లి దండ్రుల్ని గూర్చిగానీ చెప్పుకో లేదు. కానీ"పథియశసాంభాససామిల్ల కవిపుత్రాదీనాం-----"అని మాళవికాగ్ని మిత్రంలో ప్రశంసించబడిన వాక్యాన్ని బట్టి ఇతణ్ణి కాళిదాసు కన్న పూర్వుడని నిర్ణయించవచ్చు.

ఈ కవి రచించిన నాటకాలు 13. వాటిని a) పురాణ మౌలికాలు b)కల్పితాలు c) కథా సరిత్సాగరాన్ని ఆధారంగా గ్రహించినవి అని మూడు విధాలుగా లభిస్తాయి.

1. ప్రతిమా నాటకము ,అభిషేక నాటకము- రామాయణం
2. అవి మారకము, చారుదత్తము - కల్పితాలు
3. ప్రతిజ్ఞాయౌగంధరాయణము
4. స్వప్న వాసవదత్తము కథాసరిత్సాగరం
5. పంచరాత్రము
6. మధ్యమ వ్యాయోగము -భారతం

7. బాల చరితము – భారతం
8. దూత వాక్యము – భారతం　　వీటి కాధారం హరివంశం
9. దూత ఘటోత్కచము–భారతం
10. కర్ణభారము – భారతం
11. ఊరు భంగము – భారతం

ఈ అవిమారక నాటకానికి నాటి జనసామాన్యంలో ప్రచారంలో వున్న కథ ఆధారం. నిర్మల మైన ప్రణయ స్వరూపానికి నాటకం దర్పణం. కథా నాయకుడని 'అవి' అనే రాక్షసుణ్ణి అతడు చంపటం వల్ల అవి మారకుడనే పేరు సార్థక మైంది. నాటకానికి సైతం అతని పేరే పెట్టబడింది. శైలీప్రసన్నత, భావ సౌకుమార్యం, ఔచిత్య పోషణ, మనస్తత్త్వచిత్రణ ఈ నాటకంలో భాసుని ప్రతిభకు సాక్ష్యాలుగా నెలకొన్నాయి.

సుప్రసిద్ధ పండితకవి శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు తెలిగించిన నాటకాన్ని ప్రాచీన సాహిత్య పోషణ కార్య క్రమమంలో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానములచేత ముద్రించబడిన ఈ ఉత్తమ నాటకం ప్రజామోదాన్ని పొందగలదని మా నమ్మకం.

కార్య నిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

V

ఈ నాటకంలోని కథా సంగ్రహం

అవి మారకం 6 అంకాల నాటకం. దీనిలోని నాయకుని పేరు అవిమారకుడు. 'అవి' అనే రాక్షసుణి ఇతడు చంపటం వల్ల ఇతనికి అవి మారకుడనే పేరు సిద్ధించింది.

సౌవీర రాజకుమారుడైన ఇతడు ఋషిశాపం చేత క్షత్రియత్వాన్ని కోల్పోతాడు. ఒక సమయంలో అవిమారకుడు తన మేనమామ కుంతి భోజుని కూతురు కురంగిని మదపుటేనుగు బారినుండి రక్షించి ఆమెను ప్రేమిస్తాడు. కురంగి కూడ అతణ్ణి ప్రేమిస్తుంది. అవిమారకుడు చేటికల సాయంతో రహస్యంగా కురంగి అంతఃపురంలో ఒక సంవత్సరం గడుపుతాడు. ఒకదశలో రహస్యం బైటపడగా అతడు ఆత్మహత్యకు పాల్పడతాడు. ఆ సమయంలో విద్యాధరుడొకడు అవిమారకుణ్ణి ఆత్మహత్యా ప్రయత్నం నుంచి మరల్చి అతని కొకమాయ ఉంగరాన్ని ప్రసాదిస్తాడు. దాని సాయంతో అతడు ఆత్మహత్యకు సిద్ధంగా వున్న కురంగిని రక్షిస్తాడు. ఇంతలో శాపకాలం ముగుస్తుంది. నారదుడు వచ్చి అవిమారుకుణ్ణి కుంతి భోజునికి పరిచయం చేస్తాడు. నారద పాత్ర సహాయంతో కురంగి అవిమారకుల వివాహం జరిగి కథ సుఖాంతంగా ముగుస్తుంది.

భాస మహాకవి రచితమైన ఈ నాటకానికి అతని దినాల్లో ప్రజల్లో ప్రచారంలో వున్న లోక కథ ఆధారమై వుంటుందనీ, తర్వాత ఇది వాత్స్యాయనుని కామ సూత్రంలోను, గుణాఢ్యుని బృహత్కథలోను చోట చేసి కొన్న దనే డా. ముదగంటి గోపాల్ రెడ్డి + సుజాత రెడ్డి గార్లు అభిప్రాయపడుచున్నారు. (సంస్కృత సాహిత్య చరిత్ర – 366 వ పేజీ) –

***

అనువాదకర్త పరిచయం

1. మూలకారుడు – భాస మహాకవి.
2. అనువాదకుడు – చిలకమర్తి లక్ష్మీ నరసింహం.
3. జననము – 26-9-1867.
4. జన్మస్థలము – ఖండ పల్లి.
5. నివాసము – రాజమహేంద్రవరము.
6. తల్లి దండ్రులు – రత్నమ్మ, వెంకయ్య.
7. నిర్యాణము – 17-6-1946.
8. రచనలు – మొత్తము సంఖ్య. 90.

సౌందర్య తిలక, కర్పూరమంజరి, అహల్యాబాయి – మున్నగు నవలలు, గయోపాఖ్యానము, ప్రసన్న యాదవ నాటకము, పార్వతీ నాటకము మొదలగు నాటకములు, రాజస్థానకథావళి, స్వీయ చరిత్రము వగైరా వచన రచనలు, వీరి కలం నుంచే వెలువడి యావదాంధ్ర దేశంలో ప్రసిద్ధివహించాయి.

***

పాత్రలు

పురుషులు , స్త్రీలు

1. సూత్రధారుడు
2. నటి.
3. భూతికుడు – కన్యాంతఃపుర రక్షకుడు – మంత్రి
4. కురంగి – రాజపుత్రి – నాయిక.
5. హితుమతి (ప్రతీహారి)
6. భటుడు.
7. కౌంజాయనుడు – మంత్రి
8. విదూషకుడు.
9. చంద్రిక – చేటి
10. కౌముదిక – చేటి
11. అవిమారకుడు – నాయకుడు (విష్ణుసేనుడని నామాంతరము)
12. దాది.
13. నళినిక
14. మాగధిక – కురంగి చెలికత్తెలు
15. విలాసిని
16. కురంగి చెలికత్తెలు–నళినిక, మాగధిక, విలాసిని
17. విద్యాధరుడు (మేఘనాదుడు)
18. సౌదామిని – విద్యాధరుని భార్య
19. చెలికత్తెలు–హరిశిక, వసుమిత్ర, జయద
20. కుంతి భోజుడు – రాజు.
21. సౌవీరదేశాధిపతి.
22. సుదర్శనాదేవి – రాణి.
23. నారదుడు.

మున్నగువారు

***

అవిమారకము

1

అవిమారకము

ప్రథమాంకము.

(నాంద్యంత మందు సూత్ర ధారుఁడు ప్రవేశించున్నాఁడు.)

సీ. జలధితో యమునుండి సానుకంపంబుగాఁ
జిమ్ముఁగఁ బడి నిల్చి కొమ్ముచివర
నలకాల నిమిడి యాహతదైత్య వర్గమై
యాక్రమింపం బడి యాజి యందు
రక్షింపఁబడి సుదర్శనచక్ర మహిమచే
భుక్తమై కడుఁ బ్రీతిపూర్వకముగ
నిరుపమ ధీరత నిజ బాహువశమయి
యుచ్ఛ్రితైకాతపత్రోజ్జ్వల మయి

*తే. గీ. దనరువసుమతీమండలి దయ దలిర్ప
నొసఁగుఁ గావుత మీకు దామోదరుండు
రాక్షసారాతి యాదినారాయణుండు
సచ్చిదానంద నిలయుండు సర్వ విభుఁడు.*

(తెరవంకజూచి) ఓసీ! యిటు రా

(నటి ప్రవేశించి)

నటి – అయ్యా! ఇదిగో వచ్చితిని.

సూత్ర – ఓసీ! కుతూహలముచేత నీ మొగంబునఁ బొడచూపుచున్న చిరునవ్వు నీమనోగతమైన భావము నివేదించుచున్నట్లున్నది. ఏదో చెప్పఁ దలఁచుకొన్నావు కాదా.

నటి – మీరు భావజ్ఞు లగుటలో విస్మయ మేమున్నది.

సూత్ర – అటులయిన నీయిష్టమేమో చెప్పుము.

నటి – నేను మీతో గలిసి యుద్యానవనమునకుఁ బోఁగోరుచున్నాను. అక్కడఁ జేయవలసిన నియమకార్య మొకటి నాకుఁగలదు.

(తెరలో)

భూతిక! కురంగీరక్షణార్థము నీవుఁగూడ నుద్యానవనమున కరుగుము. అంజన గిరియను నేనుఁగు మదించి చరించుచున్నది.

సూత్ర - ఓసీ! రాజపుత్రిక యుద్యానవనమున కరిగినదన్నమాట విన్నావుకదా! అందువలన నిప్పు డుద్యానవనమున నన్ని దిసలును రాజభటపరిగుప్తము లై యుండును రాజపుత్రిక వెడలిపోయిన తరువాత మనము యథేచ్ఛముగ వెళ్ళవచ్చును.

నటి - సరే! మీచిత్తము వచ్చినట్లు చేయుదము.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు)

ఇది స్థాపన

***

ప్రథమాంకము.

1(అప్పుడు రాజు సపరివారముగఁ బ్రవేశించుచున్నాఁడు)

రాజు -

ఉ. *సవనము లెన్నొ జేసితిఁ బ్రసన్నులు నా యెడలన్ మహీసురుల్*
చవిఁగని రాజిలో భయరసంబును మత్తనృపాలు రెల్ల నా
కవిరళభూతి యున్న మది హర్షములే దొకయింత యేలనై
భవములు కూఁతులం గనినవారలకుం బహుచింతలే సుమీ.

కేతుమతీ! నీవు పోయి దేవిని బిలిచికొని రమ్ము.

ప్రతీహారి - దేవా చిత్తము (అని నిష్క్రమించును.)

(అప్పుడు సపరివారముగ దేవి ప్రవేశించుచున్నది.)

దేవి - మహారాజ! జయము. జయము.

రాజు - దేవీ! ముఖము నిత్యప్రసన్న మయినను నేఁ డత్యంత ప్రసన్నమయి యున్నది. ఈమహాహర్షమునకుఁ గారణ మేమి.

దేవి - దేవ! మనకురంగినిమిత్తము దూత వచ్చినాఁడని మీరె సెలవిచ్చితిరిగదా. అందుచేత నచిర కాలమునే యల్లుని జూడఁ గలుగుదు నని సంతోషించుచున్నాను.

రాజు - ఆ! అదికూడ నిజమే అయినను నిశ్చయము కాలేదు రమ్ము. ఇటు కూర్చుండుము.

దేవి - దేవా చిత్తము. (అని కూర్చుండును)

రాజు - దేవీ! వివాహము లనఁగా బహువిధములఁ బరీక్షించి చేయఁదగినవి. ఎందుచేతననఁగా,

తే. గీ. *అల్లునిగుణంబు లించుకే నరయకుండఁ*
దనదునభిలాషకై తండ్రి తనయ నొసఁగ
నది కులద్వయంబును మాపు మదముచేతఁ,
గూలయుగముఁ బొంగిన యేఱు గూల్చునట్లు.

ఏదో చప్పుడువలె నున్నది. అది బహు కారణమువవల్ల కావచ్చును.

తే. గీ. దూరవుది యైనబహుజనోద్భూత మగుట
ద్గగరది వోలె నున్న దీధ్వని సహస్ర
కారణము లుండు దీనికిఁ గానియేమొ
మాకురంగికి శంకించు మనసు కీడు.

దేవి - అమ్మో నాకూఁతు రుద్యానవనమున కేగినది.

రాజు - ఎవఁడురా అక్కడ.

(భటుఁడు ప్రవేశించి)

భటుఁడు - మహారాజా! జయము ఆర్య కౌంజాయనుఁడు దేవర వారితో నేదో మనవి చేయుటకు వచ్చినాఁడు.

రాజు - త్వరగాఁ బ్రవేశపెట్టుము.

భటుఁడు - చిత్తము దేవా (అనినిష్క్రమించును)

(అప్పుడు కౌంజాయనుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

కౌంజా - (నిర్వేదవముతో) అహో! మంత్రిత్వ మెంతకష్టకార్యము ఎందుచేతనన.

మ. ఘన కార్యంబులు సిద్ధిగన్న యెడలన్ క్ష్మాభర్త దౌఁబ్రజ్ఞ, యే
పనులైనన్ జెడినా యమాత్యునిది లోపం బంద్రు, సన్మంత్రులం
మను విఖ్యాతిని గాంచు నెల్ల యెడలన్ శోభిల్లి భూపాలదం
డనముం గాంతురు చిన్న తప్పులకె కట్టా మందభాగ్యుల్ జనుల్.

జయ సేన! మహారాజు గారెక్కడ నున్నారు? ఏమనుచున్నావు! ఉపస్థాన గృహమం దున్నా రనియా? అట్లైన నది నిశ్శంకముగా బ్రవేశింపఁ దగిన చోటు (నడచి సంభ్రమముతో) దేవా! అనుగ్రహింపు మను గ్రహింపుము.

రాజు - తొందరపడకు. తొందరపడకు. సుఖముగాఁగూర్చుండి వృత్తాంతముఁ జెప్పుము.

కొంజా – దేవా చిత్తగింపుఁడు. రాజపుత్రికతోఁగూడ నుద్యానవనమునకుఁ బొమ్మని దేవరవారు నన్నాజ్ఞాపించితిరి గదా.

రాజా – అట్లు చెప్పిన మాట నిజమె ఇప్పు డేమి?

కొంజా – అట్లు రాజపుత్రిక యుద్యానవనమున కరిగి యథా సుఖముగా నాడుకొని మరలివచ్చుచుండఁగా దాసదాసీజనుల గొడవలును నవ్వులును విని బెదిరి ఘోర బృంహితము సేయుచు స్రవించు మద జలవర్షముచేత మొగమెల్ల దడియ మావటీని నేలం గూల్చి చమిరి మునుగ పైచిన తెరంగున మన్ను మేనంగ్రమ్మ నవ్యక్తభీమమూర్తి యై మూర్తీభవించిన వాయు దేవుఁడోయన తనలఘుప్రచారము దృష్టాదృష్టమై యుండ దేవర వారి మంత్రుల యందు నింద నారోపింపఁ దలచుకొన్నదియుం బోలె నొకానొక పురుషునకు మాత్రము ప్రతిష్ఠ గలిగింప నిశ్చయించుకొన్న దియుం బోలె, దుర్మదాంధమై యొక్క దంతావళమందుఁ బ్రవేశించెను.

రాజా – గ్రంథవి స్తర మటుండనిచ్చి ముందిది చెప్పు. కురంగి కుశలముగ నున్నదా?

కొంజా – దేవర వారి యదృష్టము మిక్కిలి మంచిదైనప్పుడు కుశలముగా నేల యుండకపోవును.

రాజా – అమ్మయ్య. అదృష్టవంతుఁడని. ఇప్పుడు వృత్తాంతము నీయిష్టము వచ్చినట్లు చెప్పు.

కొంజా – అనంతరము ప్రాకృతజను లందఱుఁ బరుగులెత్తిరి. స్త్రీలు హాహాకార మాత్రములచేతనే ప్రతీకారము చేసిరి. కొందరు పురుషులు వచ్చిన వారి వెనుక దాగొనిరి. నీతిగుప్తుఁడ నయిననేను దూరమందు నిలిచి యుద్యానవనమునకుం గొంపోఁబడిన సమస్తోపకరణములు సరిగా నున్నవో లేవో యని పరీక్షించుచుంటిని. అంతలో నా గజము రాజపుత్రిక పల్లకిమీఁదికి వెళ్ళెను.

దేవి – అమ్మో ఇట మీఁద నేమగునో గదా.

రాజా – అప్పుడు కురంగి కెవ్వరు దిక్కైనారు?

కౌంజా - అప్పుడొకదర్శనీ - (సగము చెప్పి యూరకుండును.)

రాజా - ఇప్పుడు యథేష్టముగాఁ జెప్పు. మహాపదలు పరిహారములు లేనివికదా!

కౌంజా - అప్పుడొకానొక పురుషుఁడు మిక్కిలి దర్శనీయుఁ డయ్యు విస్మితుఁడు గాక, తరుణవయస్కుఁ డయ్యు నహంకార భావములేక, శూరుఁడయ్యు దాక్షిణ్యవంతుఁడై, సుకుమారుఁడయ్యుమహాబలవంతుఁడై మదగజంబుబారిం బడుటకు సిద్ధముగానున్న రాజ పుత్రికకుఁ దత్కాలదుర్లభమగు నభయంబు నొసంగి నిశ్శంకముగ నాగ జేంద్రముతోఁ దలపడెను.

రాజా - అతనిఋణము మన మెన్నఁడుఁ దీర్చికొనలేము. తరువాత తరువాత.

కౌంజ - అంతట నాదుష్టగజ మతని సలలితసరభసకరతల తాడనంబులఁ గడుంగడు రోసముం బూని వెంటనే రాజపుత్రిని విడిచి వానిం జంపఁ దలఁచి యాతని వంకకు మరలెను.

దేవి - అతనికిఁ గుశల మగుఁగాక.

రాజా - తరువాత తరువాత.

కౌంజ - అనంతర మక్కడికి వచ్చిన భూతికుఁడును నేనునుంగలసి రాజపుత్రికను వెండియుఁ బల్లకిలోఁ గూర్చుండఁ బెట్టి త్వరితముగఁ దోడ్కొనిపోయి కన్యాంతఃపురమునఁ బ్రవేశ పెట్టితిమి.

రాజా - అహో! ఇదియెంతో గొప్ప ప్రమాదముగదా. సరె భూతికుఁ డెందుచేత రాలేదు?

కౌంజ - "ఓయి! నీవుపోయి యీవృత్తాంతము రాజా గారికి విన్నవింపుము. నేనాపురుషుని ప్రవృత్తిని వంశమును గనుఁగొని శీఘ్రముగ మరలి వచ్చెద" నని భూతికుఁడు నాతోఁ జెప్పి పోయెను.

రాజా - అట్లయిన భూతికుఁడు సర్వము పరీక్షించి వచ్చునా? కౌంజాయనా పరవ్యసనములఁ జూచి సహింపలేక సహాయమును జేయునట్టి యాపురుషుఁడేకులమున జనించెనో యెఱుఁగుదువా?

కౌంజా - స్వామీ! నేను కడజాతి వాఁడనని యతఁడెందుచేతనో తన్ను గ్పపుచ్చుకొనుచున్నాఁడు.

దేవి - మహారాజ! కులీనుఁడు గానివాఁడట్టి దయాళువు కాఁగలఁడా.

రాజా - కాని మాట యథార్థము.

(అప్పుడు భూతికుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

భూతి - (విస్మయముతో) అహో! భూమి ప్రచ్ఛన్న రత్న మయియున్నది కదా. ఆపురుషుని నిర్వ్యాజ విక్రమముచేత మానధనుల విక్రమబుద్ధులు మందీభూతము లయినట్లున్నవి. నాకొక్క సంశయము కలదు. ఎందుచేత నతఁడు తన్ను దనవంశమును గ్పపుచ్చుకొనుచున్నాఁడు? ఐననేమి. ఎవ్వఁడు సూర్యుని హస్తముచేత నాచ్ఛాదింపఁగలఁడు.

చ. *గురుజనశాసనంబునను గోప్యము లైన స్వకీయ కారణాం*
తరముల మారువేసములు దాల్చి చరింతురు సజ్జనుల్ భువిన్
బరులకు నాపదల్ పొడముపట్లను దొంటి ప్రతిజ్ఞ లన్నియున్
మరచుచు వ్యక్తు లయ్యెదరు మానవకోటికి మేలు సేయఁగాన్.

జయసేన! ప్రభువు వారెక్కడనున్నారు? ఏమనుచున్నావు - ఉపస్థాన గృహమందున్నా రనియా? అది నిశ్శంకముగాఁ బ్రవేశింపఁదగిన చోటు ఇదే ప్రవేశించెదను. (ప్రవేశించి) అహో! ఈమహారాజాగారు దేవీసమేతు లైయున్నారే. (సమీపించి) మహారాజ! జయము జయము

రాజా - దేవీ! నీ వభ్యంతరమందిరముఁ బ్రవేశించి కురంగి నూరార్పుము. నేను వెంటనే వచ్చెదను.

దేవి - దేవరవారిచిత్తము (నిష్క్రమించుచున్నది.)

రాజా - పరోపకారార్థము తన శరీరము దాఁచుకొనని యామహాపురుషుని వృత్తాంతమేమి?

భూతి - దేవ! అవధారు. అతఁడొక్క ముహూర్త మనాదరము గా నత్వరితముగా సలలితముగా మిత్రునితో నాడిన చందంబున నామద పుటేనుఁగుతో నాడి నివర్తనానువర్త నాదిగతి విశేషంబులచే దానిని

భ్రమింపఁజేసి యాపనిచేత సిగ్గుపడిన వాఁడుఁబోలె మహాజనులు తన్ను గూర్చి సేయుప్రశంసను సహింపక తలవంచుకొని యథేచ్ఛముగఁ దననివాసమునకుం జనియెను.

రాజు – ఓహో! సంతోషించితిని. ఇదినాకు రెండవలాభము.

భూతి – తదనంతర మాఁడుఏనుఁగులం గొన్నింటిని దోడ్కొని పోయి యామదగజంబును మెల్లమెల్లగా ననునయించి గజ శాలం బ్రవేశపెట్టి నే నాపురుషుని ప్రవృత్తిని వంశమును నన్యాపదేశమునఁ దెలిసికొనుటకుఁ బోయితిని.

రాజు – పిమ్మట నీవేమినిశ్చయించితివి? అతఁడంత్యజుఁడని యిదివఱకు మేము వినియుంటిమి.

భూతి – పాపము శమించుఁగాక! శమించుఁగాక! అతఁడట్టివాఁడు కాఁడు. ఏదో కారణము చేత నతఁడు తన్నుఁ దనవంశమును గొప్పచుచ్చు కొనుచున్నాఁడు.

రాజు – నీవు పరీక్షించితివా?

భూతి – పరీక్షించుట కేమున్నది?

ఉ. *రూపము దివ్యరూప మగు రూఢిగ వాక్కులు బ్రహ్మవాక్కులు*
ద్దీపిత సౌకుమార్యమును దేజము శక్తియు క్షాత్రముల్ సుమీ
యీపలుకే యథార్థ మగునేని యతం డొకమాలయేని నా
నాపృథు శాస్త్ర మార్గముల నాదుపరిశ్రమ నిష్ఫలం బగున్

రాజు – అతనికి భార్య యున్నదా?

భూతి – అంతయుఁ గలదు. కళత్రమును నేను స్వయముగా వెళ్లి చూడ లేదు.

రాజు – పరస్త్రీ దర్శనము జేయఁ గూడదు. కనుక నీవు కళత్ర విషయము కనుఁగొనలేదు సరే. అతనితండ్రినేల నీవు పరీక్షింపలేదు!

భూతి – సత్పుత్రసంపన్నుఁ డైన యతనిదర్శనము జేసితిని. యతఁడు,

శా. వ్యాయామస్థిరదీర్ఘపీనభుజుఁడున్ జ్యాఘాతసంకల్పిత
స్ఫాయత్ తీవ్రకిణప్రకోష్ఠుఁడును నై ప్రచ్ఛన్నుఁ డైయుండియున్
జ్ఞేయుం డయ్యెను రాజచిహ్నములచేఁ జెన్నొందుటన్ దోయద
చ్ఛాయన్ డాఁగి ప్రభానుమేయుఁడగు భాస్వంతుండువోలెన్ స్వ పా.

రాజు – ఈ ప్రసంగము చాలును. మరల బరీక్షసేయుము.

భూతి – దేవరవారి యాజ్ఞాప్రకారము చేసెదను.

రా – ఇప్పుడు కాశీరాజు దూతను గూర్చి యేమి చేయవలయును?

భూతి – స్వామీ! దూతలు నూరుమంది వచ్చుచుందురు. పోవుచుందురు.

తే. గీ. ఇందుఁ గర్తవ్య మొకటి లే దెంచిచూడ
వసుధఁ గన్యాపితృత్వంబు వంద్యము సుమి
రాచకన్నెల నాశింత్రు రాకొమరులు
జయపతాకంబు మల్లులసమితి వోలె.

రాజు – అందలి యభిప్రాయ మేమి?

భూతి – ప్రతిచోటను మోమోట ముండఁ గూడదు. గుణ బాహుళ్యమును సమయౌచిత్యమును, నుత్తర కాలస్థితిని జక్కగాఁ బరిశీలించి వేగిరపాటును దీర్ఘ సూత్రత్వమును విడిచి దేశ కాలముల కవిరోధముగాఁ గార్యము సాధింపవలయు నని దానియభిప్రాయము.

రాజు – భూతికుఁడు లెస్సగాఁ జెప్పినాఁడు. కౌంజాయన! ఏల నీ వూరకుంటివి?

కౌంజా – స్వామీ! క్షతియు లనేకు లున్నను పూర్వసంబంధ విశేషముండుట చేతను దేవరవారికి భగినీభర్త లగుటచేతను కాశీ రాజ సౌవీర రాజులు సమానులు. మనకు సంబంధ యోగ్యులని దేవరవారిదివఱకే తలంచు చున్నారు. ఆయిరువురలో సౌవీరరాజు మును పొకసారి తనపుత్రున కమ్మాయి నిమ్మని దూత నంపినాఁడు. కన్యమిక్కిలి చిన్నది. ఇప్పుడు తొందర యేమి యని యేదో వంక బెట్టి మనమాదూతను బూజించి

తొందర యేమి యని యేదో వంక బెట్టి మనమాదూతను బూజించి సగౌరవముగాఁ బంపితిమి. ఇప్పుడు కాశి రాజు బిడ్డను దన కుమారున కిమ్మని దూత నంపినాఁడు. ఈ విషయమును బలాబలవిచారణలో దేవరయే ప్రమాణము.

రాజు -కౌంజాయనుఁడు చక్కగాఁ బలికినాఁడు. భూతిక సకల రాజమండలమువూట యటుంచి యిప్పుడు నిరూపింపఁబడిన యీయిరువురిలో నెవరికడ విశేషమున్నది?

భూతి - వారు మహారాజులు. భృత్యుల మయిన మేము వారి యోగ్యతాయోగ్యతల నెంచి దూషింపఁ గూడదు. దేవరవారి మంత్రులకు దేవరవారే యధికారులు.

రాజు - ఉపచారవాక్యములు చాలును. నిశ్చయ మేదో తెల్పుఁడు.

భూతి - ఇప్పుడు దేవరవారి కడ్డు చెప్పఁగూడదు. సౌవీర రాజ కాశీ రాజులు భగినీభర్త లగుటచే దేవర వారికి సమానులు. అందు సౌవీరనాథుఁడు దేవి గారికి సోదరుఁ డగుటచేత గుణాధికుఁడు.

రాజు - నీవు నాసంకల్పమున కనుకూలముగనే పలికితివిగదా?

భూతి - నేను రెండువిధములచేత ననుగ్రహింపఁ బడితిని.

రాజు - ఓయీ! సౌవీర రాజు మరల మనకడకు దూత నేల పంపలేదు.

భూతి - ఆవిషయమున నాకును నింమక సందేహము గలదు. లెస్సగాఁ బరీక్షించి చెప్పవచ్చు నని నే నింతవఱకు మాటాడలేదు.

రాజు - ఆయన కుశలియై యున్నాఁడా?

భూతి ---వేఁగులవాం డ్రిట్లనుచున్నారు.

తే. గీ. *పుత్రసహితుఁడై యారాజు పోయె నెటకొ*
జరుపుచున్నారు కార్యముల్ సచివు లరసి
రాజగృహము ప్రవేశింప రాదు గాన
నేమి హేతువో యీస్థితి కెరుగరాదు.

రాజా – ఇందుకుఁ గారణ మేమి చెప్పుమా?

మ. *కడుఁ గామాతురుఁడై యమాత్యతతిచే గాసిల్లి బంధింపఁగాఁ*
బడెనా దారుణరోగసంకలితుఁడై ప్రాణంబులం బాసెనా
జడుఁడై బ్రాహ్మణ శాపముం బడసి నిష్ఠస్ శాంతులం జేయునా,
విడువంగాఁ బని యేమి గేహమును బృథ్వీభర్త యీరీతిగన్.

ఈవృత్తాంతము బరీక్షించి శీఘ్రముగ రమ్ము.

భూతి – దేవరవా రాజ్ఞాపించినట్లు జేయుదును.

రాజా – కౌంజాయన! ఇప్పుడు కాశీ రాజ దూత విషయమున నేమి చేయవలయును.

కౌంజా – అట్లైన మనము కాశీ రాజదూతను బూజించి పంపుదము. వివాహములు బహుముఖములు కావున వానిని యథేష్టముగ సాధింపవలయును.

రాజా ––అహో! అమాత్యులబుద్ధి కార్యమునేగాని, స్నేహము న పేక్షింపదు.

(తెరలో)

స్వామీ! జయము. మహారాజ! జయము. పదినాళికలైనవి.

భూతి – స్వామి! స్నానవేళ యతిక్రమించుచున్నది. తక్కిన విషయ మంతఃపురమునం దాలోచింతము. మీరుఁగూడ నమ్మాయి గారి నోదార్పవలెను. దేవిగారుగూడ మీకొఱ కెంతో సేపునుండి యెదురు చూచుచుందురు. మహాజనులును నీ యుపద్రవమునందు దేవరవారిని జూడఁగోరుచున్నారు.

రాజా – అహో! రాజ్య మత్యంతభార మైనది గదా.

సీ. *ధర్మంబ మునుముందుఁ దలపోయవలయును*
మంత్రిని గనిపెట్టి మసలవలయు
రాగరోషములు దీరత దాచవలయును
నీలోకవృత్తంబు నెఱుఁగవలయుఁ

చారనేత్రముల దేశము జూడవలయును
బాటింప వలయును బ్రజలసుఖము
ఆత్మరక్షణ సేయ నగుఁ బ్రయత్నముచేత
ఖండనంబున నది పనికిరాదు.

తే. గీ. మృదుపరుషగుణంబులు కడు మెలపుతోడఁ
గాలయోగంబుచేఁ బ్రయోగంబు సేసి
పాలనము సేయవలయు భూపాలుఁ డెపుడు
నిత్యధర్మతత్పరుఁడైన నృపుఁడు వెలయు.
(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ప్రథమాంకము.

***

అవి మారకము

ద్వితీయాంకము.

(అప్పుడు విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

విదూ -- ఆహో! రాజకుమారు లవస్థావిశేషంబుల నెఱుఁగరు కదా. అందుచేతనే పూజ్యుఁడయిన యవిమారకుఁడు ఋషిశాపంబు వలనఁ గలిగిన కులభ్రంశమును జండాలకులప్రవాసమును దన విజ్ఞానమును గురుజనంబును లెక్కసేయక హస్తిసంభ్రమదివసంబున నెప్పుడు కుంతిభోజపుత్రిక యయిన కురంగి కంటఁ బడినదో యప్పటి నుండియు మారిపోయి క్రొత్తవాఁడయిన ట్లున్నాఁడు. ఇహిహిహి పలుమాటలేల? నాతోఁగూడ గోష్ఠి గట్టుకున్నది. ఎల్లప్పుడుఁ జింతించుచు నభిరమించును. అనర్థము లొక్కటొక్కటిగ రాక గుంపులు గూడి వచ్చు ననులోకోక్తి నిక్కమే కదా. ఇం దేమిసంబంధ మున్నది. ఆచిన్నది మహారాజపుత్రిక నేను మాలవాఁడ నని చెప్పుకొనుచున్నాఁడితఁడు. అంతవఱకు నేనును బ్రాహ్మణనింద దప్పించుకొనుటకై బ్రాహ్మణుల గృహములలోనే తిరుగుచు మారాజకుమారుని బసకుఁ బ్రచ్ఛన్నుఁడ నయి పోవుచున్నాఁడను.

(అప్పుడు చేటి ప్రవేశించుచున్నది.)

చేటి - అవస్థ లీవిధముగ మారిపోవుటచే రాజగృహంబున నాకుఁ బని విశేషముగ లేనందున నగరము జూడ వచ్చితిని. అదిగో ఆర్యసంతుష్టుఁ డిటే వచ్చుచున్నాఁడు. మంచిది కొంచెమసే పితనితో వేళాకోళ మాడి వినోదించెదను. ఓసీ! కౌముదిక! బ్రాహ్మణుఁడు దొరికినాఁడా? ఏమనుచున్నావు - దొరకలేదనియా.

విదూ - చంద్రికా! ఏమిటది.

చేటి - అయ్యా! బ్రాహ్మ ణునికొఱకు వెదకుచున్నాను.

విదూ - బ్రాహ్మణుఁ డెందుకు?

చేటి - వేఱుపని యేముండును, భోజనమునకుఁ బిలుచుటకు.

విదూ - ఓసీ! నే నెవఁడను, బ్రాహ్మణుఁడను గానా?

చేటి - నీవుబ్రాహ్మణుఁడవే గాని వైదికుఁడవు గావు.

విదూ - ఎందువలన నేను వైదికుఁడను గాను? నేను పండితుండను గాననుకొన్నా వేమో చూడు. రామాయణ మనునాట్య శాస్త్ర మొకటి యున్నది. అందులోని వైదుశ్లోకములు నే నొక్క సంవత్సరములోపుగానే వల్లించితిని.

చేటి - ఎఱుఁగుదు నెఱుఁగుదును. ఈయఖండ మయిన తెలివి మీకే గాదు మీకులమువారి కందఱకుఁ గలదు.

విదూ - కేవలము శ్లోకములే గావు. అర్థముకూడ వల్లించితిని. మరొకవిశేషము. అక్షరములు నేర్చియర్థము గూడ నేర్చిన బ్రాహ్మణుఁడు దొరకుట కష్టము.

చేటి - అట్లయిన దీని మీఁదనున్న యక్షరము లేవో చెప్పుము

(అని యుంగర మిచ్చుచున్నది.)

విదూ - (తనలో) నాకక్షరములు రావు. ఏమిచెప్పుదును? అయిన నిట్లు చెప్పెదను. (ప్రకాశముగా) ఓసీ! అయక్షరము నాపుస్తకములో లేదు.

చేటి - అక్షరాలు రానివాఁడవుగనుక దక్షిణ లేకుండ వట్టి భోజనము చేసిపొమ్ము.

విదూ - సరె, సరె.

చేటి - అయ్యా! నీయుంగరము నేను గూడఁ జూచెదను. ఇమ్ము.

విదూ - చూడుచూడు. నాయుంగరము చూడఁ దగినదే.

చేటి - (పుచ్చుకొని) అదిగో రాజకుమారుఁ డిటే వచ్చుచున్నాఁడు.

విదూ - (వెనుక వైపు జూచి) ఏఁడీ ఏఁడీ. రాజకుమారుఁడు.

చేటి - ఈమూఢ బ్రాహ్మణుని బుట్టలోఁ బెట్టితిని. ఈయుంగర మీతని కియ్యక యీమనుష్యుల గుంపులో దూఱి యీతని వంచించి నాలుగు వీథుల మొగలోఁ బడి పోయెదను.

(నిష్క్రమించుచున్నది.)

విదూ - (అంతటఁజూచి) చంద్రికా! చంద్రికా! ఎక్కడ చంద్రిక? అయ్యో! న న్నిది మోసపుచ్చినది. ఈ దొంగదాసియొక్క నైజము నే నెఱిఁగి యుండియు భోజనము పెట్టుదు నని యాస గొల్పుటచేత నమ్మి మోసపోయితిని. (నడచి) దీని భోజనముగూడ పట్టి య బద్ధమే యని తోఁచుచున్నది. (ముందుజూచి) అన్నన్న! అదిపరుగెత్తిపోవుచున్నది. నిలునిలు దొంగదాసి పారిపోకు. ఏమిది? నామాట వినిపించుకొనక యది పరుగెత్తుచునే యున్నది. నేనును బరుగెత్తెదను (పరుగెత్తిపోవును) కలలో నేనుఁగు చేత పట్టుపడిన వాని కాళ్ల వలె నా కాళ్లు సాగక దిగఁబడి పోవుచున్నవి. అంట్లకుండలు కడుగునట్టి యీ బానిస కూఁతురు యొక్క వృత్తాంతము రాజకుమారునితోఁ జెప్పెదను.

(నిష్క్రమించును)

ఇది ప్రవేశకము.

****

(అప్పుడు కూర్చుండి యవిమారకుఁడు ప్రవేశించుచున్నాఁడు)

అవి -

చ. *ఎడపక కూడి స్వప్నముల, నేనిక తుండపునీటితుంపరం*
దడిసిన మేనితో, భయమునం జలియించెడు గన్ను దోయితో
బెడఁగగు రాచకన్నియను వెండియు మేల్కని పూర్వజన్మమున్
దడ వెడు జాతివేత్తవలె దాని స్మరించెద మాటిమాటికిన్.

ఆహా! ఏమి యీయనంగుని బలము. ఎందువల్ల నన,

చ. *అది మొద లన్యరూపములు నక్కట చూడదు దృష్టి, బుద్ధియున్*
ముదమును గాంచు, విహ్వలత బొందు స్మరించును
మాటిమాటికిన్
వదనము చెందియున్నయది పాండుత, మేను కృశించెడున్,బవల్
మది నసమానశోకమును మాపులు మోహము, బొ ందు
చుంటిఁగా.

కాకున్నను బురుషుల కధైర్యము కూడదు. నేను సంకల్పించుకొలది మదఁను డంతకంతకు విజృంభించుచున్నాఁడు. అందువలన నేనింక మీఁద సంకల్పము మానెదను. (జ్ఞాపకము చేసికొని) ఆహాహా! ఏమి యామెరూపసంపద! రూపమునకుఁ దగిన యౌవనము, యౌవనమునకుఁ దగిన సౌకుమార్యము.

ఉ. *చందురులోని మేలిరుచి చక్క నిముద్దియ యయ్యెనో ప్రతి*
ఛ్ఛందముగా రచించెనొకొ చానలరూపులకున్ విధాత దీ
నిం దరుణీతనూధరుని నీరధి శాయిని నాథునిన్ రమా
చందనగంధి బాసి నృపసద్మమునన్ వసియించుచున్నదో.

అయ్యో! ఏమి యామెనుగూర్చి నేను మరలఁ దలపోయ నారంభించితినే. ఇప్పుఁడేమి చేయుదును? మనస్సు గూడ నాయిచ్ఛాప్రకారము నడుచుట లేదు ఇప్పుడు-

తే. గీ. కడుఁబ్రయత్నంబుచేతను క్షణము సేపు
తెలివపై నుండి మనసును ద్రిప్పిన నది
తొల్లి యలవాటు పడినట్టి త్రోవ కేగుఁ
దప్పువల్లన వడిన శాస్త్రంబులాగు.

మనస్సు జయింప శక్యము కాదు. ఆమెనే స్మరించెదను. అహో! అందఱి స్త్రీలయొక్క గుణములొక్క చోట గుమి గూడినవి.

(చింతించుచుఁ గూర్చుండును)

(అప్పుడు దాదియు నళినికయుఁ బ్రవేశించుచున్నారు)

దాది – (సవితర్కముగ) అహో! కార్య మెంత దుస్సాధ్యముగా నున్నది. ఈలాగునఁ జేసినచో రాజగృహము దూష్యమగును. చేయనిచో నామె యవశ్యము విపత్తు నొందును నే నెన్నో యుపాయములు విచారించితిని. ఆమె తనకోరిక నాకుసయిత మిప్పటికిని జెప్పక దాఁచుచున్నది. పాపము! ఏమి దాచినది. అదిమొదలుకొని యామె పూలదండ దరికి రానియ్యదు, ఆహారముమాట యెత్తనీయదు, ప్రియ సఖులతో నిష్టాగోష్ఠిని మెలఁగదు; ఊరక నిట్టూర్పులు విడుచును; అసంబంధముగ మాడలాడును; ఏమి చెప్పుచున్నదో యెఱుఁగదు; తనలోఁదానె నవ్వుకొనును; ఒంటిగాఁ గూర్చుండి యేడ్చును ఏదో రోగముని వంకబెట్టుచుండును; చిక్కి శల్యమయినది. మేను పాలిపోయినది; ఒకటే యాశ్చర్యము; ఈవిధముగా నవస్థావిశేషముల నొందుచుండియు నామె సిగ్గుచేతను వెఱపుచేతను నిజకులాభిమానము చేతను బాలభావముచేతను గుట్టు వెలిపుచ్చి యొకరితో నైన నాలోచించి యెఱుఁగదు.

నళినక – ఆలోచింప కేమి. నాతోనంతయుఁ జెప్పుచునేయున్నది.

దాది – సఖీ! నీయభిప్రాయము నాకుఁ దెలిసినది. ఈయవస్థ నెఱిఁగి యామె నెట్లయిన నతనితోఁ గలుపవలసినదని.

నళి – అటువంటి గుణవిశేషములచేత వెలయుచున్న యతఁడు కులహీనుఁ డెట్లగును?

వినియుంటిని. అతడు కులహీనుఁడు కాఁడనిచెప్పిరి. ఏదో కారణముచేత దుష్కులజుఁడనని పైకిఁ జెప్పుచున్నాఁడట.

నళి – ఎవఁడై యుండును జెపుమా?

దా – ఆసందేహము లేకపోయిన యెడల నిటువంటి మంచి గుణములు కలవాఁడెవ్వఁడు మనకల్లుఁడుగ లభింపఁగలఁడు.

(తెరలో)

చ. *విభవము శక్తి రూపము వివేకము నుండిన నుండుఁ గాక దు*
ర్లభములు వృత్తశుద్ధులు కులంబునఁ దక్కువ యైన వారియం
దభిమతసిద్ధిగా వినెద రాతనివంశము ప్రాప్త వేళలన్
శుభమగు నింక శంక విడి శుద్ధ మనస్కత మీర లుండరే.

దాది – సఖి! ఆమా టెవరిది?

నళి – ఇక్కడ నెవరుఁ గనఁబడుట లేదు.

దాది – నామేను గరిపొడచుచున్నది. ఇది నిశ్చయముగ దైవము చెప్పినమాట. నామాట తప్పదు. ఇది కేవలమానుషవాక్యము కాదు.

నళి – అతని విషయమ్మై కులసందేహము పోయినది. మనమాట చొప్పున నతఁడు నడచునా లేదా యనిసందియంపడుచున్నాను. అతనిని మోహింపఁ జేయఁగల జనము ధన్యమైనది. ఇన్ని మాట లేల? నిజముగ మదన దేవుఁడు సయితము రాజపుత్రికరూపముఁ జూచి సంతాప మొందును. కాఁబట్టి యితఁడుఁగూడ సంతాప మొందుచున్నాఁడని తలంచెదను.

దాది – నఖి! యిదె యతనివాసము. ఆహస్తిసంభ్రమదివసమున నిక్కడికే కదా వచ్చితిమి.

నళి – సఖీ! ఈద్వారముఖము ముగ్గులు మొదలయినవి పెట్టి యుండుటచే దర్శనీయ మైయున్నది. రమ్ము ప్రవేశింతము.

దాది – సఖి! ఏఁడీ రాజకుమారుఁడు. ఏమనుచున్నావు? చతుశ్శాల

యందున్నాఁడనియా. ఇదిగో! రాజకుమారుఁ డొంటిగఁ గూర్చుండి ఏమో చింతించు చున్నాఁడు.

నళి – సఖీ! ప్రవేశింతము.

దాది – ఇట్లు చేయుదము. (ప్రవేశించి) అయ్యా మీకుసుఖమా?

అవిమారకుఁడు – అహో! ఏమి యామె రూపసంపద.

దాది – (ఆకులముతో) ఏమిది! యిట్లున్నాఁడు. అయ్యా! మీ కుసుఖమా?

అవి –

చ. ఘనకటి భారఖిన్న మలగాత్రము, బొమ్మకుచాలసంబహో?

దాది – అమ్మో! ఏమోప్రేలుచున్నాఁడు.

అవి –

కనుఁగవదెచ్చె నందము మొగంబున కోష్ఠము బింబతామ్ర మౌ

దాది – ఈయన నింత మోహింపఁ జేయునట్టి యాజనము మిక్కిలి ధన్యము.

అవి –

అనుపమభీతియందును దదంగము లోచనపాత్ర పేయమౌ,

దాది – కార్యము చక్కఁబడినది.

అవి –

ననవిలు కానికయ్యముల నాతివిలాసము లెట్టు లుండునో

దాది – ఆమెయే యితని కింత వెఱ్ఱి యెత్తించుచున్నది.

నళి – లెస్సగాఁజెప్పితివి. ఇతఁడును సంతాపించుచున్నాఁడు.

దాది – నీవు చక్కగఁ గనిపెట్టితివి. అయ్యా! మీకుసుఖమా

అవి – (చూచి సిగ్గుపడి) మీయిరువురకు స్వాగతము.

ఉభయులు – అయ్యా! మీకు సుఖమా?

అవి – మీదర్శనముచేత సుఖమే యగును.

దాది – అయ్యా! మీ రేమి చింతించుచున్నారు?

అవి - కళ్యాణీ! శాస్త్రము చింతనచేయుచున్నాను.

దాద - ఒంటిగఁగూర్చుండి చింతనచేయవలసిన యారమణీయ శాస్త్రమేది?

అవి - కళ్యాణీ! యోగ శాస్త్రము చింతనచేయుచున్నాను.

దాది (చిఱునవ్వుతో) మంగళవచనమె నోట వచ్చినది. అ - యోగశాస్త్రమే యౌఁగాక!

అవి - (తనలో) ఈవాక్యమున కర్థమేమి. విషయము వేఱొకటి కాఁగా నాయభిలాషమువలన నేను మఱొకటిగా సమర్థించుచున్నాను. (ప్రకాశముగ) నీ వేమనుచున్నావు?

దాది - మేమును యోగము గోరియే వచ్చినాము. మీరును యోగము ననుమతించుచున్నారు గనుక మా కార్యము నెఱవేరినది. మారాజ గృహమునందు నిర్జనమైన చోటు కలదు. అచటఁగూడ నెల్లప్పుడు యోగమే చింతించు జనము కలదు. ఆజనముతోఁ గలసి దేవరవారు నిశ్చలముగా యోగచింత చేయవచ్చును.

అవి - నాకింకను నవశిష్టములయిన భాగ్యములు కొన్ని గలవా? (ఆసనమునుండి లేచి) కళ్యాణీ! నాప్రాణములు తిరిగి వచ్చినట్లున్నవి. ఎందువల్లననఁగా,

తే. గీ. *తీక్షణంబు, భయాకులదృష్టివిషము*
సౌమ్యము, మనోజ్ఞమునగు నాజాణ మొగము
నేఁ గని విమోహితుఁడ నైతి నిన్ని నాళ్ళు,
భవదమృతవాక్యముల నిప్డు బ్రతికిపోతి.

దాదా - అయ్యా! అదృష్టవంతులము. మమ్ము మీరు రక్షించినారు. ఇంక పలుమాట లేల? కన్యాంతఃపురము. నేఁడే ప్రవేశింపఁదగును. కన్యాంతః పురరక్షకుఁడును, మంత్రియు నైనభూతికుఁడు మహారాజుగారి యాజ్ఞ ప్రకారము కాశీ రాజు దూతతో నేఁడు వెళ్ళినాఁడు.

అవి - మంచిది. అదే మొదటిపక్షము. కళ్యాణీ! ఔషధము దొరికినతరువాత దాని నుపయోగింపని మూర్ఖరోగి యుండునా?

దాది - ప్రవేశమాత్రమే దుర్లభము. ఒక్కసారి ప్రవేశించితిరా యంతఃపుర మున మీచిత్తమొచ్చినంతకాల ముండవచ్చును.

అవి - నేనుఁబ్రవేశించినాననుకొ! వేండ తలుపులగడియలు తీసి యుంచుము.

దాది - అట్లే చేయుదుము. అంతఃపురమునఁ జేయవలసిన దంతయుఁ జేసి మేము సిద్ధముగ నుందుము. మీరు జాగరూకతతోఁ బ్రవేశింప వలయును.

అవి --కల్యాణి! రాజగృహముయొక్క విధానమునా కించుక జెప్పు.

దాది - ఈలాగు. ఈలాగు. (అని చెవిలో జెప్పుచున్నది.)

అవి -ఓహో!

తే. గీ. *నృపునిగృహసంవిధానంబు నెఱుఁగుకతన,*
నందు నే బ్రవేశించినయట్లె దలఁదు
దేవ మీపట్ల నన్యథా దలఁపకున్న
బరులు మెచ్చఁగఁ దగియుండుఁ బౌరుషంబు.

(ఆలోచించి) కల్యాణి! ఈ కార్యమందు నాకు మీనమ్మకమేమి?

ఉభ - ఇది నమ్మకము. (అని చెవిలోఁ జెప్పుచున్నారు.) రాజకుమార జయము.

అవి - సరె. మీరిఁకవెళ్ళుఁడు. అర్ధరాత్రమున గనిపెట్టుకొనియుండుఁడు.

ఉభ -చిత్తము దేవా! (ఇద్దఱునిష్క్రమించుచున్నారు.)

(అప్పుడు విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు)

విదూ - ఆహా! ఈనగర మంతశోభగా నున్నది. భగవానుఁడైన సూర్యుఁ డస్తమించుచున్నాఁడు పెరుఁగుముద్దలవలె నున్న తెల్లని మేడలయందును నంగళ్ళ ముంగిళ్ళయందును సూర్యకాంతి బెల్లపుపానకమువలె వ్యాపించుచున్నది. పెలయాండ్రును నాగరవిటులను, జక్కగనలంకరించు కొని యొండొరులం జూచుపేడ్కఁ దమతమమేడల యందు విహరించు చున్నారు. నేనటువంటివి శేషము లన్నియుఁ జూచి వికలచిత్తుఁడైన రాజ

కుమారునకు సాయ ముండ వచ్చితిని. అతఁడు నాదురదృష్టము చేత నెవ తెనో జూచి చిత్త విభ్రమము గలిగి క్రొత్తవాఁడు లాగున్నాఁడు. ఇదే మారాజపుత్రునిగృహము. రాజపుత్రిక యొక్క దాదియు సఖియు రాజకుమారుని యిల్లువిడచి యిప్పుడే పోయిరని యంగడివీథిని నేను వింటిని గదా. వారికేమిపని యుండును జెపుమ? పురుషులభాగ్యము లేనుఁగుతుండమువలె మిక్కిలి చంచలములు. బహుశః మాయాపదలు గట్టెక్కవచ్చును. అవస్థకుఁ దగియున్న మారాజగృహము బ్రవేశించెదను. (ప్రవేశించి) హి. హి. ఇదిగో! మారాజ పుత్రుఁడు. ఏదో రంగు పూసి కొన్నట్లు తెల్ల బారిన మొగముతో నిటేవచ్చుచున్నాఁడు. ఐన నేమి, చక్కనివారి కన్నియు నలంకారము లేయగును. (సమీపించి) అయ్యా !నీకు జయము.

అవి – మిత్రుఁడ! నీవు నగరములో మిక్కిలి జాగుచేసితివే .

విదూ – మొదట బ్రాహ్మణార్థమునకుఁ బిలువఁబడి పిదప భోజనము దొరకక భంగపడిన బ్రాహ్మణుఁడు వలె నీవు రేయింబగళ్ళుఁ జింతించు చున్నావు. దినమంతయు నగరమందుఁ దిరిగి సరసు నెందును గానక వాఁడుమొగముతోవచ్చు పామరవేశ్యలవలె నీప్రక్కను బండుకొనుటకయి యింటికి వచ్చితిని.

అవి – మిత్రుఁడ! నీకొక ప్రియము చెప్పెదను.

విదూ – మనబుషిశాపము సమాప్తమైనదా యేమి?

అవి – మూర్ఖుఁడ! అవశ్యము కాఁదలచిన కార్యములఁ గూర్చి సంతోష పడనేల?

విదూ – అట్టైన మ టేమున్నది?

అవి – కురంగి యొక్క దాదియు నళినికయు, నీకుగనబడ లేదా?

విదూ – ఆహా! వారిద్దరుఁ గనఁబడినారు. ఏమి తెచ్చినారు?

అవి – నాకు శోకనివారణమగు నౌషధముఁ దెచ్చినారు.

విదూ – ఏది, యేది చూడనిమ్ము.

అవి – సమయము వచ్చినప్పుడుఁ జూచెదవు అంతవఱకు విను.

విదూ – చెప్పు, చెప్పు?

అవి – ఇన్ని మాట లెందుకు. నేఁడె కన్యాంతఃపురముఁ బ్రవేశింపుమని దాది నన్ను బురికొల్పినది.

విదూ – (నవ్వి) అంతఃపురము బ్రవేశించి బ్రదుకఁదలఁచుకొన్నావా? కుంతిభోజుని మంత్రులు విషమశీలురుసుమా!

అవి – ఏమి నీకును శంకింపఁ దగిన కారణ మున్న దా? చూడు.

ఉ. ఒక్కఁడనే ససైన్యముగ నోర్చితి వైరుల నాజిలోన, నే
నుక్కడఁగించినట్టియరు లుచ్చదశన్ మఱి బొందలేదు నాఁ
డక్కుటిలాసు రేంద్రుఁడవి యాకృతి దాలిచి నాభుజద్వయిన్
జిక్కి నశింప లేదె యిఁక నేను మనుష్యుల లెక్క సేతునే?

విదూ – ఎరుగుదు నీయమానుష కర్మము లెరుగుదును. ఐనను నర్ధ రాత్రమునఁ బరగృహప్రవేశ మన్ని విధముల శంకింపవలసినది.

అవి – నేను సారాంశము జెప్పెదవినుము. కుంతిభోజునికన్యాంతఃపురము సర్వవిధములఁ బ్రవేశించితీరవలయును. ఈవు మహాబ్రాహ్మణుఁడవు. కనుక దీని ననుమతింపవలయును.

విదూ – నన్ను విడిచిపోయెదవాయేమి. నేను ని న్నెప్పుడును విడువను. నీవు వద్దు మొఱ్ఱో యన్న నొక్కఁడను పెంబడింపకమానను.

అవి – నీకు శాస్త్ర మార్గములు తెలియవు.

తే. గీ. పరగృహంబున కొక్కఁడే యరుగవలయు.
మఱియొకనితోడఁ దగు సేయ మంతనంబు,
పలుజనులతోడఁ గయ్యంబు సలుపవలయు
శాస్త్ర నిర్ణయంబిది సుమీ సఖుఁడ వినుము.

కాబట్టి కుంతిభోజుని కన్యాంతఃపురము నేనొకఁడనే ప్రవేశింపగలను. మావిషయమున నీవు శంకింపఁ దగదు. చూడు,

తే. గీ. మితిగుణము కుంతిభోజభూమిధవుసేన
యానృపతి గేహమును సొచ్చు టతిసులభము
అఱసి చూడంగ మేము భుజాయుధులము
శంకనీయ మేమున్నది సఖుఁడ నీకు.

విదూ – అట్లైన నీవు కృతనిశ్చయుఁడ వైతివి. ఇప్పుడు నగరము ప్రవేశింతము రమ్ము. అక్కడ నాకొకమిత్రుఁ డున్నాఁడు. అతని గృహమందు మనము కొంత ప్రొద్దు గడుపుదుము.

అవి – నీవు చక్కగ జెప్పితివి. ఇప్పుడు నే నభ్యంతరమందిరమునకుఁ బోయి సాయాహ్నికకృత్యములఁ దీర్చుకొని మహారాజాగారి యనుజ్ఞబడసి వాస గృహమునందు శయనసంవిధానముజొచ్చి పిమ్మట నగరముం బ్రవేశించి నీమిత్రునియింటఁ గొంతసేపు గడుపుదము.

చేటి – (ప్రవేశించి) భర్తృదారక! జయము. జయము. స్నానోదకము సిద్ధమయినది.

అవి – ఇదె, యిదె వచ్చుచున్నాఁడను. నీవు ముందు నడువుము,

చేటి – చిత్తము దేవ!

అవి – మిత్రుఁడ! భగవానుఁడైన దివాకరుఁ డస్త మించినాఁడు.

ఇప్పుడు.

తే. గీ. పాలుచు జీఁకటి పూతవేఁ బూర్వదిక్కు
సంజకెంజాయతోనొప్పుఁ బరమదిశయు
మిన్ను రెంటు విభక్తమై మెఱయుచున్న
ద్ధనారీశ్వరాకార మనుకరించి.

విదూ – నీవు లెస్సగఁ బలికితివి. పగలు గడచినది. ప్రదోషకాల మారూఢ మైనది.

అవి – ఆహా! యేమియీ జగత్తు యొక్క విచిత్ర స్వభావత! ఏలయన.

తే. గీ. చెలిమికాఁడ! ప్రొద్దనుబొట్టు చెరిగి పోయె
దుస్సహంబగుబీ రెండ తొలఁగి చనియెఁ
భ్రమర మయ్యెను చుక్కల బారు మింటఁ
చల్లనయి హాయిగావీచె సన్న గాలి

తే. గీ. చోరులిందందుఁ దోరఁబడఁ జూచుచుండ్రి
దాఁగియున్నారు కాముకుల్ తరుణమరయ
మనుజలోకంబు క్షణములో మార్పుఁజెంది
యౌర! వేషాంతరము బూనినట్టు లుండె

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు)

ద్వితీయాంకము

****

అవివాహితకవము
తృతీయాంకవము.

(అప్పుడు కురంగియు నిరువురు చేటులుఁ బ్రవేశించుచున్నారు.)

కురం – సఖీ! అతఁడేమి చెప్పెను?

మాగధిక – ఎతఁడు?

కురం – (తనలో) అయ్యో! మందభాగ్యురాలను. గుట్టు బయటబెట్టుకొంటిని. (ప్రకాశముగ) ఎతఁడా? కన్యాపుర చేటుఁడు.

మాగధిక – కన్యాపుర చేటుఁడు నా కగుపడినాఁడు. పలుక రించితిని గూడ. ఏమియుఁ జెప్పలేదె.

కురం – అన్నా! కన్యాపుర చేటుఁడు చిలుక పంజరము చేయించి నాకియ్యలేదని దేవితోఁ జెప్పెదను.

మాగ – చిలుకపంజరము నీకున్నదికదటమ్మా.

కురం – ఓసీ ప్రేలరీ! ఒకటే కాదు నాకున్నది? రెండవదున్న దా

మాగ – కావచ్చును.

కురం – సఖీ! ఇప్పుడెంత ప్రొద్దయినది?

మాగ – ప్రదోషకాల మయినది.

కురం – అట్లయిన మేడ నెక్కుదము రమ్ము.

మాగ – ఓసీ విలాసినీ! నీవుముందు వెళ్ళి యాసనములను శయనములను సిద్ధముచెయ్యవే.

విలా – నీవు నిద్రపోయితివి కాఁబోలు. శయనాసనములు సిద్ధముచేసి యెంతసేపైనది?

మాగ – సఖీ! నీవు ప్రతిపనిలో నాలస్యము చేయుదువని నానమ్మకము ఉదయమున పైచినప్రక్కలే యిప్పుడు పై చితినని చెప్పుచున్నావు.

విలా – సఖీ! అట్లనవద్దు. రాజపుత్రిక పేరు చెప్పఁగానే ప్రాఁతశయనములు క్రొత్తశయనము లగును.

మా -- సఖీ! అట్లయిన వెళ్లి చూచెదను (అందరునడచుచున్నారు)

విలా - ఇదే మేడ.

కురం - నీవు ముందునడువుము

(మేడనెక్కుటనభినయించుచున్నారు)

మాగ - బాగు విలాసినీ! బాగు. నీ పేరునకు దగినట్లె రచియించితివె

శయన మీశిలాతలమున రచియించితివా?

విలా - శయన మధ్యంతర మండపములో రచియించితిని. మాగధికా!

నాయాలస్యము చూచితివా?

మాగ---ఆహా! చూచితిని. అతిపండితురాల వయినావు. నీ వలెనే

పండిత చేటవృత్తుఁడగు మగనిఁ బడయుము.

కురం - సఖీ! ఈశిలాతలముననొక్క నిముసము గూర్చుండెదను.

మాగ - రాజపుత్రీ నీకిష్టమైనట్లు జేయుము.

(అందఱుఁ కూర్చుండుదురు.)

మాగ --- రాజపుత్రీ! నేనొక యాఖ్యానము జెప్పుదునా?

కురం -- సఖీ! నీయసంబద్ధ ప్రలాపములు నేనెఱుఁగుదును. కట్టి

పెట్టు

మాగ --- రాజపుత్రీ! కథ క్రొత్త దమ్మా.

కురం--నిన్ను వేడుకొనుచున్నాను. కాని నన్ను బలవంత పెట్టకుము.

ఒక్కనిముసము పండుకొనియెదను.

విలా --- భర్తృదారికను సుఖముగాఁ బండుకొన నియ్యవే. కథ

నాకుఁజెప్పు. నేను వినియెదను.

కురం --- (తనలో) ఈకథ యే మై యుండును?

మాగ --- సఖీ! విను. భర్తృ దారికను గుఱించి.

కురం -- అయ్యో! నాగుట్టుబయలుపడినది. పరిభ్రష్టురాలనైతిని.

విలా - సఖీ! నీవీకథ యెక్కడవింటివి!

మాగ - దేవి గారి పరిచారిక యైన వసుమిత్రవలన వింటిని.

విలా – అట్లయిన స్వయముగా దేవి గారివలన వినినట్లె.

మా – కాశిరాజునకు జయవర్మయను కుమారుఁడు కలఁడు రాజపుత్రిక నతని కీయనిశ్చయించినారు. ఆయనదూతకూడ వచ్చినాఁడు మహారాజుగా రాదూత నెంతో గౌరవించినారు. ప్రథానము కూడ జరిగినది.

కుర – (తనలో) ఇది వట్టిమాట. నాకు నేనే యజమానురాలను.

మాగ– అప్పుడు దేవిగారిట్లుచెప్పిరి. "నా కూఁతురు చిన్న పిల్ల దానింజూడక నేనొక్క దినమయినను బ్రాణము నిలుపలేను. మహారాజు గారు ప్రసన్నులయిన యెడ నిల్లరికపు టల్లుని దేవలయునని" వేఁడు కొనుచున్నాను.

విలా – తరువాత, తరువాత.

మాగ – తరువాత మహారాజుగారికిఁ గూడ నది యిష్టమయినది. ఈదినము నక్షత్రము మంచిదని యాదూతతోఁ గూడ మంత్రియైన యార్యభూతికుఁడు వెళ్ళినాఁడు.

కురం – (తనలో) అయ్యో! కార్యము వ్యవధానమైనదే.

విలా – ఆహా! ప్రియము. ప్రియము. రాజపుత్రిక యొక్క రూపయౌవనము సఫలమయినది.

(అప్పుడు నలినిక ప్రవేశించుచున్నది.)

నలినక – మాయమ్మ యిట్లు చెప్పిన దిగదా. "అమ్మాయి నీవు వెళ్ళి యీ వృత్తాంతము రాజపుత్రికతోఁ జెప్పుము. ప్రియములు ప్రియురాండ్రు చెప్పినప్పుడు ప్రియతరము లగును. ఆమె నన్ను జూచి చెప్పిన ట్లితరులతో విశ్వాసముంచి చెప్పదు. సమయము వచ్చినప్పుడు నేనును నా మెప్రక్కనే యుండెదనని" ప్రియమంతయు భర్తృ దారికకు విన్న వించెదను.

కురం – నాకు వెట్టి యెత్తించుచున్న యీ క్రొత్త రోగమేమిటి చెపుమ? పూలదండలపై మనసుపోనీయదు. గోష్ఠిపయి ధ్యానము నిలువనీయదు. ఇదిదారుణము మనోహరము గూడనై యున్నది. నలినికా ఏమిటే యిది.

(నిట్టూర్పు పుచ్చుచున్నది.)

మాగ – రాజపుత్రీ! నేను మాగధికను.

విలా – భర్తృ దారికా! నేను విలాసినిని గాదటమ్మా.

నళిని – (సమీపించి) రాజపుత్రీ! నేను నళినికను. మేడమెట్లచప్పుడు చేతనే నీవు తెలిసికొనియుందువు. రాజపుత్రీ దేవిగా రిట్లనుచున్నారు.

కురం – ఏమని?

నళినిక – (చెవిలో) ఇట్లు. ఇట్లు

కురం – అయ్యో! చారిత్రము హీనము

నళినక – అయ్యో! అతఁడు సంభావనీయుఁడమ్మా. అతఁడీ యితఁడు గదమ్మా.

కురం – నళినికా! నన్ను బట్టుకొమ్ము

నళినిక – మంచిదమ్మ

విలా–నళినికా! వివాహమెప్పుడగును?

ఇప్పుడు.

(తెరలో)

నళి –– చిరంజీవివిగమ్ము

(తెరలో)

రాజపురుషులారా! మంత్రి గ్రామాంతరము వెళ్లినాఁడని మంత్రి భృత్యుఁడొక్కఁడైనఁ గన్యాపుర రక్షణార్థము రాలేదు. సరె! వారిష్టము వచ్చినట్లు జేయనీ. ఈ సంగతి రేపు రాజు కారితో విన్న వించెదను.

విలా– సఖీ! నళికా! నామాటకుత్తర మియ్యవేమి?

నళి –– ఆరాజకుమారుఁ డెప్పు డిక్కడికి వచ్చునో యప్పుడే వివాహమగును.

విలా – ఆయన నిర్విఘ్నముగఁ బ్రవేశించుఁగాక!

నళినిక – అట్లేయగుఁగాక!

మాగ – సఖీ! రావె! చతుశ్శాలలో గూర్చుందము.

విలా – అట్లగుఁగాక! ప్రదోషము వెళ్లి పోయినది వెన్నెల వచ్చినది.

నళి – సఖి నాకుఁగూడ శయనము పఱుచుము.

మాగ - అవకాశమున్నది. నిద్ర వచ్చువఱకు రాజపుత్రిక కుపచారము చేయుము.

నళి - సరె. (విలాసినీ మాగధికలు నిష్క్రమించుచున్నారు)

(అప్పు డవిమారకుఁడు త్రాడుచేతబూని కత్తిబట్టుకొని చోరవేషముతోఁ బ్రవేశించుచున్నాఁడు.)

అవిమార - (సవిమర్శముగా) అహో! తారుణ్యము మిక్కిలి కష్టమైనది గదా. ఎందువల్లననఁగా

ఉ. రాగము వృద్ధి జేయును కరంబు ప్రమాదము నాశ్రయించెడున్
దా గణియింపనీయ దొకతప్పును సాహసవృత్తిఁ జొచ్చు స్వే
చ్ఛాగమనంబు సల్పెడును సైచదు నీతిపథంబు సన్మనీ
షా గురుఁడైన వానిమతి సైతమహో వివశంబు జేసెడున్.

ఏమిది! ఆత్మాధీనము లయిన యర్థములందు మందుఁడ నగుచున్నాను. ఇప్పుడు-

గీతమాలిక.

పట్టణం బంతయును నాకుఁ బరిచితం బె
రక్షిపురుషుల బాహుసారం బెఱుఁగుదు
గాటముగఁ బర్వినట్టి చీఁకటులతోడ
నర్ధ రాత్రంబు భీమ మై యదను గూర్చె.
వాఁడికత్తి కేలను నిల్పి తోడు సూపు
నతిదృఢముగ నిశ్చిత మయ్యె నంత రాత్మ
ఇన్ని విధములఁ జింతింపనేల నేను
నిపుడు దుష్కరం బగునర్థ మేది నాకు.

అహో! ఏమి యర్ధ రాత్రము యొక్క భయంకరత్వము. ఇప్పుడు,

సీ. *గాఢ నిద్రను గూడి గర్భస్థులటు ప్రజ*
లురు మోహమును జెందియున్న వారు
నిశ్శబ్దముగ జనుల్ నిదురించుచుండుట
హర్మ్యముల్ ధ్యానించునట్లు నిలిచె

మేటిచీఁకటి తమ్ము బ్రమింగినై చినయట్లు
దారిలోపల నున్న తరువు లెల్ల
స్పర్శాను మేయభావము జెంది యున్నవి
కందోయి కక్కట కానఁబడక

తే. గీ. నఖిలజగము నంతర్ధాన మైనయట్లు
వరలు బ్రచ్ఛన్న మైన రూపంబుఁ దాల్చి,
గ్రంథములలోన వినిన యాకాళ రాత్రి
నేఁడె వచ్చియున్నటు లుండె నిశ్చయముగ.

చ. పలుతిమిరప్రవాహములఁ బారుచు నున్నవి మార్గవాహినుల్
పులినతలంబులట్లు గడుఁ బొల్చుచును న్నవి హర్మ్యమాలికల్
చెలఁగెడు దిక్కులన్నియును జీఁకటిలోన మునింగినట్లు తె
ప్పలపయి దాటి పోఁదగినభాతిగఁ జీఁకటి యున్న దిత్తరిన్.

(నడచి చెవియొగ్గి) అహో! గాంధర్వధ్వనివల వినఁబడుచున్నది. కాంతతోఁగూడ గాంధర్వ మనుభవించుచు సార్వకాలసుఖి యయిన యీపురుషుఁ డెవ్వఁడు చెపువమా? ఇతఁడు స్వయమముగా వీణ వాయించుచున్నాఁడు. ఏలయన -

తే. గీ. మేడ కడు నెత్తు గిటి కీలుఁగూడ మూసి
రరయ గానంబునకు నర్హ మట్టి చోటె
సానునాద మయి వచ్చె తంత్రీనినదము
నకీయ వ్రేళుల కిటు వంటి శక్తి గలదె.

పాట మాత్ర మాఁడు దానిదే.

ఉ. తానము మంద మెంతొ విశదంబు ప్రవృత్తము, వక్త్రనాసికా
స్థానములం జనించెడును శ్రావ్యతరంబయి నాద మెంచ స్త్రీ
గానమె యంటకుం గలదు కారణ మొక్కటి వేర, కంకణ
ధ్వానముతో వినంబడెడు వారక తత్కర తాళనాదముల్.

(నడచి చూచి) అహహా! ఈయన యెవఁడో కాని తనపై నలిగిన కాంతను బ్రతిమాలుచున్నాఁడు. ఈతఁడు చేసిన యపరాధ మేదో గొప్పదియై యుండవచ్చును. ఏలయని భర్త యెంతసేపటినుండియుఁ బ్రతిమాలు చున్నను నీమె ప్రసన్ను రాలు కా లేదు. ఒకవేళ ప్రసన్ను రాలయినను నీమె యేదో మిష పెట్టఁ గోరుచున్నది. ఏలయన,

ఉ. *ఆవిల బాష్పరుద్ధజడమౌ మృదుగద్గదకంఠ మొప్ప నా*
థా! విడు నీకు నే నెవరితన్ నను నంటకు మంచుఁ బల్కు స
ద్భావముచేఁ బ్రసన్న యయి భర్తృవశంగత యయ్యుఁ దొల్తస్త్రీ
భావముచే సరోజముఖి పల్కఁగడుం బ్రతికూలవాక్యముల్.

ఇది యేపక్షి చెపుమా? భైరవస్వరము గలిగియున్నది? ఆహా! ఇది గ్రుడ్లగూబ. ఏమి యిది నవ్వుచున్నదా? గ్రుడ్లగూబస్వరము విని భయపడి ప్రియురాలు పాప మితని గౌఁగలించుకొన్నది. ఇది వయస్సునకుఁ దగినపనియె. ఈపరవ్యాపారవీక్షణ మెందుకు నాకు? స్వకార్యము సాధించుకొనియెదను. (నడచి) ఎవఁడితఁడు? ఈనగ రాపణాళిందము నందు సందిగ్ధమనస్కుఁడై స్నిగ్ధముగా మాటలాడు చున్నాఁడు. పాప మితఁడు నావంటివాఁడె యైయుండవచ్చును. ఈతఁడు,

చ. *పరిజనులెల్ల మెల్లమెలఁ బల్కు మటంచును నొక్కి చెప్పి నా*
భరణరవంబులన్విని యు భ్రాంతుఁడగున్ మదనార్తుఁడయ్యు నీ
గరితలకూటము ల్మిగులఁ గష్టములంచు నుపన్యసించు చె
చ్చెర సమయస్థలంబునకుఁ జేరఁ దలంచును బోఁడక్కటా.

(నడచి) అహో! ఈవెన్నెల యెంత చక్కఁగా నున్నది. ఇది వెన్నెల కాదు. ఇది వీథికిరువంకల బారులు గట్టియున్న మేడలోని కిటికీలనుండి పైకిఁ బ్రసరించుచున్న దీపాల వెలుఁగు. ఇక్కడ మిక్కిలి ప్రయత్నముతో నాత్మసంరక్షణము జేసికోవలయును. ఓహో! వీఁడెవఁడో దొంగ, వీఁడు.-

ఉ. పరికరబంధముల్గలిగి బంధురలీలను హ్రస్వవిత్తుఁడై
పరిగృహవాదమందె తనభావము వేషలు మాడ్కి నిల్పి స
త్వరగతి నేగుచుండియును దారిని దీపఁపు వెల్గు జూచి ము
ష్కరుఁడు తొలంగు నా యడుగు చప్పుడుల న్విని భీతచిత్తుఁడై.

నాకు వీనితో నేమి? వీనిం బరిహరించెదను. ఈ నృశంసుఁడు పోయినాఁడు. ఇంక నేసును బయలు దీఱెదను. (నడచి) ఇదిగో! వీరు రక్షిపురుషులు ఇప్పుడేమి చేయుదును? తోఁచినది యుపాయము. శృంగాటకమందున్న యీ విటసభ ప్రవేశించెదను. (అట్లు చని)

చ. అలఁతిమగంటిమిం గలుగు నారెకులం గని యే దొలంగుటం
గలకల నవ్వుచున్న యటు గన్పడుచున్నది నాకృపాణి యీ
తలవరు లెంత నాయెదుటఁ దద్భులముం గని జంక నేను నేఁ
దొలఁగితి కార్య సాధనము తుష్టిని జేసికొనందలంచుటన్.

రక్షిపురుషులు వెళ్లినారు. రక్షించుకొనఁ గలవానికి రక్షకులెందుకు.

తే. గీ. జనసహాయ మక్కఱ లేని శౌర్యమూని
నిబిడ రాగలో భాత్ములు నిశఁ జరింత్రు
విషమ మయ్యు సుఖం బిచ్చు విస్మయముగఁ
బౌరుష పు సాక్షియగు నిశాభ్రమణ మౌర.

ఇదిగో రాజగృహము. ఆహో! ఈ ప్రాకార మెంతస్థిరముగా నెంత యున్నతముగా నున్నది. లోపలకుఁ బోకుండఁ బురుషులిక్కడనే వారింపఁబడుదురు, కపిశీర్షకములు దిట్టముగా నున్న పక్షమున నేను కోట ప్రవేశించనట్లే యెంచుకొనవచ్చును. ఇక్కడ నిలిచి త్రాడెగుర వైచెదను. ప్రజాపతికి నమస్కారము. సర్వసిద్ధులకు నమస్కారము. బలిశంబరమహా కాలురు ప్రసన్ను లగుదురు గాక! రాత్రి విజృంభించుగాక! నిద్ర వర్ధిల్లుఁగాక. పద్మ యనుమతించుగాక. సర్వ విఘ్నములు లయమును బొందుగాక! శత్రువులు నిహతు లగుదురుఁగాక. భగవతి యైన కాత్యాయని యనుగ్రహించునుగాక. (త్రాఁడువిసరుచున్నాడు) కపిశీర్షకమునకుఁ

త్రాడు గట్టిగాఁ దగులుకొన్నది. ఏమి? కాఁగలకార్యముయొక్క ప్రభావము. త్రాడు విసరఁగనే తగుల్కొన్నందున నాకార్యము సిద్ధించినట్లే తలంచు చున్నాను. భగవానుఁడైన ప్రజాపతి బలవంతుఁడుగదా! ఎందువల్ల ననఁగా-

తే. గీ. *ఇదిమదీయ కార్యం బని యెంచి నరుఁడు*
కష్టపడినఁ గార్యముసిద్ధి గనక పోదు
యత్నములు సేయుపిదపఁ గార్యముల సిద్ధి
దుర్లభం బయిన నందలిదోష మేది?

నరుని నిత్యశుభప్రయత్నములచేతఁ
బురుష కారంబు సిద్ధిని బొందుచుండు
గట్టిపూనిక గల దేని గార్య సిద్ధి
యవల దైవనిధానంబు ననుసరించు.

సరె. త్రాడు పట్టుకొని యెక్కెదను (ఎక్కచూచి) అహో! ఏమియీ రాజ గృహము యొక్క శోభ.

మ. *విపులంబయ్యు మితోపమం బగుచు శోభిల్లున్ విభాగంబుచే,*
నెపుడున్‌దట్టమె యయ్యు నందమయి కన్పించుం
గ్రముాభ్యున్నతిన్
నృపగేహంబు సహర్మ్యమూలముగ ధాత్రీ దేవి కాకాశమున్
నిపుణత్వంబునఁ గూర్చుచున్న కరణిం జెల్వారుఁ
జిత్రంబుగాన్.

ఇక్కడ నిలువఁగూడదు. అట్టాల ప్రతోలికలయందున్న కుక్కల వలన సర్వ విఘ్నములు కలుగును. సరె! ఈ త్రాడుతో దిగియెదను. (దిగి) ఇప్పు డీత్రాడెందు దాఁచువాఁడను. (చింతించి) సరెతెలిసినది. ఈత్రాడు త్రెంపి ముక్కలు చేసి యీ హస్తిశాలలో నిందందు జిమ్మివైచెదను. (అట్లు చిమ్మి నడచి)

సీ. కామినీకలగానకలితమై వినవచ్చెరమ్యమై తంత్రీస్వరమ్ములిచట
మఱియొకచోటికిఁ బోయెదను.
మత్తదంతావళమద సముద్భూత గంధామోద మవిరళం బైనదిచట
ఇందు క్షణ ముండి వెళ్ళెదను.
దీపాల వెలుఁగిది దీనిలో నారికుల్ స్పష్టంబుగాఁ గానఁబడెదరిచట
ఇపు డేమిగతి?
రాజీవతతితోడ రాజమందిర మెల్ల శాంతమైనది నిశాసమయ
మగుట.

ఆమె చెప్పిన మార్గమిదె. ఈ దారిన బోయెదను. ఇది మందాకిని. అది దారుపర్వతము. ఇది యుపస్థానసభ. అహో! అదే కన్యాపుర ప్రాసాదము. ఈ మేడకు కట్టుపని విశేషముగా నుండుట చేతను గవాక్షములు దగ్గరఁగా నుండుటచేతను దీని నెక్కుట సులభము. అట్లుగాక యెక్కు టకష్టమైన నేమి మానుదునా?

తే. గీ. వనితకడఁ జేర నభిలాష వశత మేడ
నెక్కఁ గోరెదునాకు నిం కేటిశంక,
తమ్మి తూడులముండ్ల భయమ్ముచేత
విడుచునే తటాకము దాహపీడితుండు.

కానీ, యెక్కెదను. (ఎక్కి) ఇది యామె చెప్పిన జాలయంత్రము. (ప్రవేశించి చూచి) బాగు కుంతిభోజ! బాగు. నీభవనము స్వర్గమును పేలాకోళము సేయుచున్నది. ఇక్కడ,

సీ. కొమరారుమాణిక్య కుట్టిమస్థలముల
హాయిగా నిదురించు నంచపిండు
వైడూర్యమౌక్తిక వరనిర్మితంబులై
సికతాప్రతానముల్ వెలుపు మీరఁ

బగడాలతోఁ గట్టఁబడినవి స్తంభముల్
వేలుగా మాటలు వేయునేల
మణులకాంతులముందు మందిరదీపముల్
మంద తేజంబులై మండఁ దొడఁగె.

ఈ రౌద్ర వేష మింక చాలును. (చోర వేషమును దీసి తలుపు దెఱచు చున్నాఁడు)

నళినిక - రాజకుమారుని వృత్తాంత మే మైనదో? నేఁడు నా ప్రియుఁడు వచ్చుననుమాట వినఁగానే యీయవస్థలో దుర్లభ మైన నిద్రను రాజపుత్రిక యెట్లో తెచ్చు కొనినది.

అవి:- (విని తొందరతో సమీపించి) కళ్యాణి! ఇదే నా వృత్తాంతము.

నళి --- (చూచి సంతోషముతో) రాజపుత్రునకు స్వాగతము

అవి:- (చూచి యానందముతో)

మ. *తనివిం జెందదు దృష్టి సాంగముగఁ గాంతం గౌఁగిలింపం దలం*
చును నాబుద్ధియు వేగిరంపడియెడున్ సుప్తాంగనన్ లేపఁ జూ
చును రాగం బతిమాత్రమై తనులతన్ శుష్కింపఁగాఁ జేయు నా
మన సానందవశంబున న్మునిఁగెడుం బల్మారు మోహాంబుధిన్

నళి - (తనలో) ఇతఁడు భగవానుఁడైన కామదేవుఁడే ప్రవాహమువలె నుభయపక్షములను బీడించుచున్నాఁడు (ప్రకాశముగా) రాజకుమార! శయనతల మలంకరింపుము.

అవి - మంచిది (అని కూర్చుండును)

నళి - భర్తృదారక? రాజపుత్రికను మేలుకొల్పుదునా?

అవి - కళ్యాణీ! చాలు నీ బాల్యచాపలము చాలు. చూడు?

తే. గీ. కనుఁగవయె గాని నాకు వేగనులు లేవు
చిత్త మతిమూఢ మభిలాష చిరతరంబు
కామవార్ధికిఁ బారంబు గంటి నేఁడు
కలికి! క్రీడింపనిమ్ము నాకన్నుఁగవను

నళి – ఎఱుఁగుదు నెఱుఁగుదును రాజపుత్రికను గూర్చియే మీ పరిశ్రమ మంతయును.

అవి – నాపరిశ్రమ నేఁడు సఫల మైనది.

కురంగి – (మేలుకొని) సఖీ! ఏమి నిర్దయగాఁ బలుకుచుంటివి?

నళి – రాజపుత్రీ! నే నేమంటిని.

అవి – ఈమె యిటువంటి మోహము బొందుటచేత నాజీవిత ఫలము నేను బడసితిని.

కురం – (తనలో) అమ్మో! పరిభ్రష్టురాల నైతిని. (ప్రకాశ ముగా) నళీ! నే నేమంటిని?

నళి – రాజపుత్రి! నీ వేమియు ననలేదు.

అవి – ఈమె మోహవిస్తరముచేత నాకు రెండవసారి మోహము కలుగుచున్నది.

కురం– నళినిక! చాల సేపటి నుండి మేలుకొని కూర్చున్నావుఇప్పు డెంత ప్రొద్దు పోయినది?

నళి – అర్ధరాత్ర మయినది.

కురం – అట్లైన నీవు మిక్కిలి యలిసి యుందువు. రా. నన్నుఁగౌఁగలించుకో

నళి – (రహస్యముగా) అయ్యా! నేను కాళ్లు పిసికెదను. రాజ పుత్రికను మీరు కౌఁగలించుఁకొనుఁడు.

అవి – (సంతోషముతో) మంచిది. ఇట్లే నీవు ప్రియశతముల వినుచుందువు గాక!

కురం –– రావె? మిక్కిలి చనువు చేత నాలస్యము చేయకు.

నళినిక – ఇదిగో వచ్చితిని. (అవిమారకుని ముందుకు ద్రో యుచున్నది.)

కురంగి –(కనులు మూసికొని బలవంతముగ లాగి యవిమారకుని గౌఁగలించుకొనుచున్నది) ఎవరే! నాకిప్పుడు కాళ్ళు పిసుకుచున్నవారు?

నళి - (చెవిలో) ఇట్టిటు -

కురం - (తొందరతో) అయ్యయ్యో! నా చరిత్ర మతిహీనమైనది. అయ్యో! భయ మగుచున్నదీ.

అవిమారకు -

మ. *ఉవిదా! క్రొత్తపడంతివా చిరమనోయోగంబుచేఁ బ్రాఁత దా*
నవె సూ గాలికిఁ దూలు తీవ పగిదిన్ గంపింపఁగా నేల భీ
తి విసర్జించి ప్రసన్ను రాల వయి నన్ దీర్పంగ దే నిందుకూ
ర్మి, వృథావాక్యము లేటి కింక శరణార్థిన్ నన్ను రక్షింపవే.

(కురంగి సిగ్గుతో నళినికను జూచుచున్నది.)

నళి - భర్తృదారక! లెమ్ము లెమ్ము. రాజపుత్రి యేమో చెప్పుచున్నది. లెమ్ము లెమ్ము.

అవి - సరే. (అని లేచుచున్నాఁడు). (దాది ప్రవేశించుచున్నది)

దాది - రాజకుమారా! జయము జయము.

అవి - ఓహో! నీవా!

దాది - నళినికా! అభ్యంతర మండపమునందు శయనము రచియింపఁబడినది. రాజకుమారుని రాజపుత్రికను నందుఁ బ్రవేశపెట్టుము.

నళి - అట్లే చేసెదను. (దాది నిష్క్రమించుచున్నది.)

నళి - రాజకుమార! అభ్యంతర మండపములో శయన మమర్పఁబడినది. భర్తృ దారికతోఁ గూడ మీరందుఁ బ్రవేశింపుఁడు.

అవి - ఇట్లే నీవు ప్రియశతములు వినుచుందువుగాక!

(అని యామెచేయి తనచేతితోఁ బట్టుకొని లేచుచున్నాఁడు)

నళి - భర్తృదారక! రమ్ము రమ్ము.

అవి - ఇదిగో ఇదిగో వచ్చుచున్నాను.

(ఇద్దఱు నడుచుచున్నారు).

అవి - (సంతోషముతో) యౌవనము యొక్క ఋణము తీరి పోయినది. ఏలయన -

మ. *కనులం దశ్రులు గ్రమ్మఁ నెమ్మనము పొంగం గౌఁగిటన్ జేర్చితిన్*
వనితన్ సిగ్గున శ్రోణిభారమున నీవామాక్షి తొట్రిల్లెడుం
జనుచో సప్తపదప్రమాణభువి యెంచన్ యోజనం బయ్యె, నా
కనుకూలంబుగ రాత్రియున్ యుగశాంత మౌనని నే ధన్యుఁడన్.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

మూడవయంకము సమాప్తము.

****

అవిమారకము

చతుర్థాంకము

(అప్పుడు చాంగేరి కాహస్తయయి మాగధిక ప్రవేశించుచున్నది)

మాగధిక - అహో! యేమి యీపరిజనము యొక్క ప్రమాదము. ప్రొద్దుపొడిచి యింత సేపైనను ప్రాసాద మలంకరింపలేదు. గోష్ఠిజనకోలాహలము వినఁబడదు. ఏమి చెప్పుమ! రాత్రి మేలుకొనఁ బట్టి యామె ప్రభాతమునందుఁగూడ నిద్రించుచుండవచ్చును. సరె. భర్తృదారికను మేలుకొల్పెదను. (నడుచుచున్నది)

(అప్పుడు విలాసినివీజనముతోఁ బ్రవేశించుచున్నది)

విలాసిని - మాగధికా! నిలునిలు.

మాగ - సఖి! నన్నాఁపకు. భర్తృదారికనిమిత్తము సుమనావర్ణకము దీసికొని పోవుచున్నాను.

విలా-భర్తృదారికకు సుమనావర్ణక మెందుకు. అలంకార మెందుకు.

మాగ - అవినీతురాల! అమంగళము పలుకకు. భర్తృదారిక నిత్యాలంకృత యగుఁగాక!

విలా - కాదే. భర్తృ దారికకు నామె యాకృతియే ప్రశస్తాలం కార మని చెప్పుచున్నాను.

మాగ - ఉన్మత్తురాలా! పుష్పమును బరిమళింపఁ జేయవలెనా?

విలా - అది తగియున్నది. స్వభావరమణీయ వస్తువుల కలంకారము చేసిన పక్షమున నవి మిగుల రమణీయము లగును.

మాగ - సఖి! భర్తృదారిక యొక్క రూపమున కనురూపుఁడైన భర్త చక్కఁగాఁ గూర్పఁబడినాఁడు.

విలా - పక్షపాతము చాలును. రాజకుమారుని సమీపమందు రాజపుత్రిక పద్మినివలెఁ గనఁబడును.

మాగ – చక్కఁగాఁ బలికితివి. భగవానుఁ డయిన కామదేవుఁడు శరీరము దాల్చి యీవిధముగా వచ్చినాఁ డని నేను తలంచుచున్నాను.

విలాసి – అట్లే! రాజపుత్రిక యీరాజకుమారుని విడచి క్షణకాలమైన సుఖముగా నుండదు.

(అప్పుడు కన్నీరు పెట్టుకొనుచు నళినిక ప్రవేశించుచున్నది.)

నళినిక – (శోకముతో) సుఖములకు బహువిఘ్నములు కలుగుచుండు నన్న లోకోక్తి నిజము. భర్తృ దారిక యవిచ్ఛిన్న సుఖసంభోగిని యయి యిప్పటికొక్క సంవత్సరమైనది. మనగోష్ఠీజనము న కుత్తరకురువాసము సంభవించినది. ఈ వృత్తాంతము నేఁడు మహారాజు గారికిఁ దెలిసిన దని విన్నప్పటినుండియు మేను వడఁకుచున్నది. పాపము ముద్ద రాలయిన భర్తృ దారిక మదనకారముచేతను లజ్జా వికారము చేతను మిక్కిలి పీడింపఁబడి సంతాపముచేతఁ జైతన్యము లేనిదానివ లె నున్నది. ఈ మేడ దీపము లేని యిల్లువలె నాదృష్టికిఁ గనఁబడుచున్నది. భర్తృదారిక లేనిపక్షమున నాకు హృదయప్రీతికరమైన దేదియు నిందుండదు. రాజకుమారుఁడు నిరపాయముగ నంతఃపురము దాఁటి యావలకు వెళ్ళినాఁడని విని నాహృదయము ప్రహ్లాదితమైనట్లున్నది. ఇప్పుడు కన్యాంతఃపురము లెస్సగా నరికట్ట బడినది. (నడ చి) ఆ! సఖులిరుగో. సఖీ! మాగధికా యిదియేమిటే?

మాగధిక– సఖీ! ఏమిటే యడుగుచున్నావు. ఇది రాజపుత్రిక కలంకార సమయము గాదటె!

నళి – ఉత్సవదినము వెళ్ళిపోయినది.

ఇద్దరు – ఓసీ! కలగనుచున్నా వాయేమి! ఆవృత్తాంతము మాకుఁగూడ జెప్పుము. మనమందరము సమానల మగుదుము.

నళి – రాజకుమారుఁడు నిశ్చయముగా వెళ్ళిపోయినాఁడు.

ఇద్దఱు – అమ్మో!

నళి - భర్తృదారిక యొక్క దుఃఖమునుజూచి సహింపఁజాలక నేనును నిటువచ్చితిని.

మాగధిక - ఆమె యొక్క యవస్థఁ జూడశక్యము కాదు గదా అయినను. భర్తృ దారికను మన మూరడింతము.

ఇద్దఱు - అట్లే చేయుదము.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రవేశకము.

****

(అప్పు డవిమారకుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

అవి - (శోకముతో)

తే. గీ. *భాగ్యవశమున నెట్టిటో బైటఁబడియె*
నాతనువుమాత్రమే రాచనగరునుండి
నాఁటఁగోలెఁ జేరదు నన్ను నామనస్సు
దృఢముగాఁ బ్రియురాలు బంధింపనోపు.

కురంగియవస్థ యెట్లున్నదో

చం. *జనులమహాపవాదములు సైపక సిగ్గును జెంది యుండునా*
జనపతిచేతఁ గట్టువడి వాలభయంబునఁ గుందుచుండునా
కనుఁగవనుండి బాష్పములు గారఁగ నన్ గన లేక రాత్రులన్
మనమునసందలంచుచును మాటికి మోహము జెందు చుండునా!

అమ్మయ్య! యిప్పుడు దానికిం బ్రతీకారము గనఁబడినది. ఆమెయు నాయందలి యపేక్షచేతఁ దనశరీమునైన నపేక్షింపదు. అందువలన నేనును నామెకొఱకే ప్రాణములను బరిత్యజించెదను. (నడచి) కొన్ని దినములనుండి నేను విదేశమునందున్నాఁడనుగదా! ఇప్పుడు నాకు మనస్సు శరీరముఁ గూడ దుఃఖ కారణములై యసహ్యములై కనఁబడుచున్న వి. ఇప్పుడు,

చం. *పరిచయవర్ధ మానదృఢ బంధురరాగము గల్గుదాని భా*
సురమగు నూత్న యౌవనము సోయగముం గలదాని ధారుణీ
వరసుత నొంటిగా విడచి ప్రాణము నిల్పితి వంచకుండ నై
ధర వయి నన్నుఁబోలెడు కృతఘ్నుఁడు కష్టుఁడొకండు గల్గునే.

ఇప్పుడు మదనునిచేత లోనఁ దహింపఁబడుచున్న నన్ను భగవానుఁడయిన సహస్ర మయూఖుఁడు పైన దహించుట కారంభించినాఁడు. (అంతటఁ జూచి) అహో! యీగ్రీష్మము యొక్క ప్రతిభయత యెంత యధికముగా నున్నది. ఇప్పుడు,

సీ. *ఆపీతసారమ్మై యవనీతలంబెల్ల*
వేఁకిసోఁకినయట్లు వెచ్చనయ్యె
దావాగ్ని గవయుటఁ దరులు నీడలు లేక
క్షయరోగమున గుందు కరణిదోఁచె
గాడ్పువేఁ గొండలు ఘనగుహాముఖములఁ
దెఱచి యాక్రోశించు తెఱఁగు దోఁచె
నీలోకమంతయు నినపాత నష్టమ్మై
మూర్ఛిల్లి నటులుండె ముమ్మరముగ.

ఇప్పుడేమి చేయుదును! నేను నడువఁ జాలకున్నాను. ఏలయన -

చం. *ఇసుమనునగ్ని చూర్ణముల నేడ్తెర బూసెడు మేనగాడ్పు, పై*
విసరుచు నెండుటాకులను వృక్షము లెంతయుఁ బీడసేసెడున్
వెస దమవహ్ని వేఁగరగి నీరయినట్లుగఁ దోఁచె భానుఁడున్
వసుమతి సూర్యపాకమున బ్రద్దలు వారెడు దారుణంబుగన్.

హాప్రియురాల! హాసుందరి! నాకుఁ బ్రతివచన మిమ్ము. (మూర్ఛిల్లు చున్నాఁడు. లేచి నిట్టూర్పు విడిచి పైకిజూచి) భగవానుఁడైన సహస్రరశ్మి యరికట్టఁబడినాఁడు.

తే. గీ. *గాలితోడ్కొని వచ్చిన కాఱు మొయిలు*
ప్రొద్దు గప్పుడు నందు నద్భుతము దేది
మనసునం దుండి నన్నేమ మదను గప్పి
పుచ్చి నాతాప మార్పు టద్భుతము గాని.

ఈజీవన్మరణముతో నేమి ప్రయోజనము? దేహపరిత్యాగము జేసెదను. (లేచి నడచుచున్నాఁడు.) ఏమిచేయుదును; సరి తెలిసినది. ఈయరణ్య తటాకమునందు శరీరము విడిచెదను. ఛీ! నామరణమార్గము కేవల మధర్మము కదా. అభిమాన మోహమువలన మహాపథము మఱచితిని. మఱియొక ప్రయత్నము జేసెదను. (చూచి) సరి తెలిసినది. అహో

కారుచిచ్చు దగ్గరనే కనఁబడుచున్నది. దానికి నాప్రాణము లాహుతి చేసెదను. (సమీపించి) నమస్కరించి భగవానుఁడ! అగ్ని భట్టారక;

గీ. *ఏకచిత్తంబు గలవారి యిష్టసిద్ధి*
యగ్ని సాధింపఁగల దేని యనఘమూర్తి!
యేకకీర్తని యైనయా యిందువదన
కాంత యగుఁ గాక నాకు జన్మాంతరమున.

(అగ్నిని ప్రవేశించ కుతూహలముతో) ఇప్పుడేమి జరుగుచున్నది.

మ. *తరువుల్ దగ్ధము లై స్ఫులింగ తతిచే ధాత్రీస్థలింగూలు భీ*
కరకీలావలి నాకు జందనపు బంకంబట్లు శీతంబగున్
కరుణం జూపెడు నగ్ని నాపయిఁ గడున్ గామాతురుండంచు బం
ధురమౌ ప్రేమను జేర్చిఁ గౌఁగిటను నన్నుం దండ్రి బిడ్డంబలెన్.

ఆహా! యింతకంటె విస్మయనీయ మేమున్నది. అగ్ని నన్ను దహింప లేదు గదా! దీని కేదోకారణ ముండవచ్చును. మఱొక ప్రయత్నము చేసెదను. (నడచి) ఇదిగో మహాపర్వతము,

సీ. *కాఱుమబ్బులగుంపు గ్రమ్ముటచే మిశ్ర*
సంద్రిగకూటవిస్తార మగుచు
నాకాశచరులైన యమరసంతతులకు
సంతత విశ్రమస్థాన మగుచు
సత్కవిమతి బోలెఁ జాలవిచిత్రమై
ప్రియమిత్ర సంయోగ హృద్యమగుచు
నీవభూపతిబోలె నిపులాఢ్యంబయి
దనరారుచున్న దీధరణీధరము.

ఈ పర్వతమునందు నాప్రాణములను విడిచెదను. మరుత్ప్రపాతము సర్వార్థ సాధకము గదా! ఎక్కెదను. (ఎక్కిచూచి) ఈశైలము మీఁదనున్న జలమున స్నానముచేసి సంధ్యావందనము జేసి మంత్రము జపించెదను.

(అట్లుచేసి జపము చేయుచున్నాఁడు)

(అప్పుడు విద్యాధరుఁడు భార్యాసమేతుఁడై ప్రవేశించుచున్నాఁడు)

విద్యాధరుఁడు -

సీ. *ఉదయ కాలంబున నుత్తరకురుభూమిఁ*
గడువేడ్క తోడుతఁ గడిపినాము
మహనీయమైనట్టి మానససరమందు
స్నానంబు నటమీఁద సలిపినాము
మందరాచలమహాకంద రాంతరముల
నెఱజవ్వనపుబనుల్ నెఱపినాము
చలువలీనెడు హిమాచలగుహాగృహముల
విహరించు వేడుక వెడలినాము

గీ. *మట్టమధ్యాహ్నమగు వేళ మనసుదీర*
మలయధారుణీధరశృంగముల వసించి
చందనమహీజశీతలచ్ఛాయలందు
హాయిగా నిద్రసేయుద మంబుజాక్షి.

(ఆకాశయానము నిరూపించి) సౌదామిని! చూడు చూడు. భగవతియగు వసుంధరయొక్క దూరస్థమైన యాకృతి మిక్కిలి దర్శనీయమై యు న్నది. ఇక్కడ -

మ. *గిరు లేనుంగులుబోలు, వార్ధు లమరం గ్రీడాసరంబుల్పొ లెం*
దరువుల్ నాచునుబోలు బావిటలచందంబూనెడున్ వాహినుల్,
వరసౌధంబులు బిందుల ట్లమరెడున్ బ్రవృన్న నిమ్నస్థలం
బరయన్ భూమి కనంబడు న్గగమహో యత్యంత సంక్షిప్తమై.

కల్యాణీ! అవహితురాలవు గమ్ము. శీతచందన నిలయంబగు మలయం బునకుఁ బోదము.

సౌదా - అయ్యా! అట్లే చేయుదుము.

(ఉభయు లాకాశయానము నిరూపించుచున్నారు)

సౌదా - అయ్యా! నేను విశ్రాంతి లేకుండ రాఁజాలను.

విద్యా - అట్లయిన నీపర్వతము మీఁదనైన నించుకసేపు విశ్రమించి వెళ్ళుదము.

సౌదా - అయ్యా! అదినాకుఁ బ్రియము. (ఇద్దఱుఁ దిగుచున్నారు.)

విద్యా - సౌదామిని! చూడు చూడు.

తే. గీ. వనధిపరివృతయగుభూమి పడెడునట్లు
లంబుదముల వెన్కకుఁ ద్రోయునట్లు ద్రోచె
నహహ! క్రొక్కాఱు మబ్బులయటులున్న
వి విజృంభమాణ పటుమహీధరములు.

కళ్యాణి యీ పర్వతము మనకు ముహూర్తకాల మాతిథ్యమిచ్చుటకుఁ దగియున్నది. అందువలన విశ్రమించి పోవుదుము.

సౌదా - అయ్యా! అట్లేచేయుదము.

విద్యా - సౌదామిని! పుష్పించిన వృక్షములనుండి యాఱవభాగము గ్రహించుట మనకు ధర్మము. అందువలన వృక్షములు ఋణవిముక్తము లగునట్లు చేయుదము.

సౌదా - అయ్యా! అట్లుచేయుదము.

(అనిపూవులు గోయుచున్నారు.)

విద్యా - (అవిమారకుని జూచి) ఆహా! యెవఁడితఁడు? ఆహా తెలిసినది. మంత్రభ్రష్టుఁడైన విద్యాధరుఁడు గదా. ఏలయన నిటువంటి రూప మన్యుల కుండదు. అదృష్టవశమువలన నీతఁడు కనఁబడినాడు. కాని నేనును దనపూర్వ వృత్తాంతము మరచిన యీతని నడిగెదను.

అవిమారకుఁడు:- సరే! దేవకార్యము దీర్చితిని. ఈ శైలము నుండి పడియెదను. (పక్కనుజూచి విధ్యాధరుంగనుఁగొని) ఓహో! యెవడితఁడు? నేను కలగనుచున్నానా? నేను నిద్రించుట లేదే. అంత్యకాలమునందు మనుష్యులకు వైపరీత్యములు గనఁబడును. ఇది యదియే య్యైయుండ వచ్చును. అట్లుకనఁబడుట మూఢచిత్తులకుఁ గదా! నేనో సర్వమెఱిఁగిన

వాఁడను. సరే! యీాయన నడిగెదను. అయ్యా! యేకులా న్వయము నీచేత నలంకరింపఁ బడుచున్నది.

విద్యా:- విను! నేను మేఘనాదుఁడను విద్యాధరుఁడను. ఈమె నాకుటుంబిని. పేరు సౌదామిని. నేఁడు భగవానుఁడైన యగస్త్యు నారాధించుటకు విద్యాధరులచేత మలయపర్వతము మీఁద నుత్సవమారంభింపఁబడినది. అక్కడికి మేమును వెళ్లవలసియున్నాము. ఇక్కడ ముహూర్తము విశ్రమించి పోవలెనని దిగినాము. ఇదే మా వృత్తాంతము. నీవెందుచేత భూతలమును దేవలోకము చేయుచున్నావు?

అవి:- (తనలో) ఇతనితో నేమిచెప్పుదును? మరణము ప్రాప్తించిన యీాసమయమున నసత్యము వచింపఁగూడదు. (ప్రకాశముగా) అయ్యా! నేను సౌవీర రాజపుత్రుఁడను అవిమారకుఁడు నాపేరు.

విద్యా:- (తనలో) ఇది యబద్ధము. ఇది మనుష్యాకృతి కాదు. (ప్రకాశముగ) అట్లయిన నీవేకాకిపై యిచ్చటి కేలవచ్చితివి.?

అవి:- (తనలో) ఏమి చెప్పుదును. (తలవంచుకొని గూరుచుండును.)

విద్యా:- (తనలో) సరే! నేనె తెలిసికొనియెదను. (విద్యను బ్రయోగించుచున్నాఁడు) అహో! కష్టము. ఇతఁడు భగవానుఁడైన యగ్ని దేవునిపుత్రుఁడు తన్నుఁ దాసెఱుగఁడు. కున్తిభోజపుత్రిక యైన కురంగి నభిలషించి కొంతకాల మామెను గూడిరమించి గుట్టు బైటఁ బడినపిదప నందుండి వెడలి వచ్చినాఁడు. మరల నారాజాంతఃపురము బ్రవేశించుట కుపాయముఁ గనిపెట్టలేక మరుత్ప్రపాతము సేయఁ దలఁచి యీాపర్వత మెక్కినాఁడు. ఆబాలికయు నచ్చట జీవన్మరణ మనుభవించుచున్నది. పాప మితనికి నే నీకార్యమున సాయము చేసెదను. (ప్రకాశముగ) ఓయవిమారక! మిత్రత్వ మనఁగా మిష లేనిది కదా. నీగుట్టు నే నెఱిఁగితిని. దానిని నీవు కప్పిపుచ్చఁ జాలవు.

అవి:- చెప్పుము?

విద్యా:- నేఁడు మొదలుకొని మనకిరువురకు సఖ్యమగుఁ గాక! నీయవస్థ సకలము మాకుఁ దెలిసినది. ప్రాణపరిత్యాగము నిమిత్తము నీ వీపర్వత మెక్కితివి కాదా?

అవి:- మిత్రుఁడా! అదినిజమె.

విద్యా:- నీవు నాయందిట్లు విశ్వాస ముంచుటచేత సంతసించితిని. ఈవిషయమున నీయాజ్ఞ యైనపక్షమున నందుఁ బ్రవేశించుట కుపాయమున్నది. నీమేమి చేయుదువు?

అవి:- (సంతోషముతో) మాఱుమాటెందుకు? ప్రవేశించెదను. ఈ ప్రయత్న మందు కేగదా.

విద్యా:- మిత్రుఁడ! అట్లైన నుంగరము చూడుము. (అని యుంగరముఁ జూపుచున్నాఁడు.)

అవి;- మిత్రుఁడ! దీనిప్రయోజన మేమి?

విద్యా:- ఈయుంగరము కుడిచేతవ్రేలికిఁ బెట్టుకొన్న యెడల నీ వెవరికిఁ గనఁబడవు. ఎడమచేతికిఁ బెట్టుకొన్న పక్షమున నెప్పటి యట్లనుందువు.

అవి:- మిత్రుఁడ! యిదినిజమా?

విద్యా :- ఇదిగో! నీకుఁ బ్రత్యక్షముగాఁజూపి నమ్మకము గలిగించెదను. మిత్రుఁడ! నీకు నే నగుపడు చున్నానా?

అవి:- ఆ చూచుచున్నాను.

విద్యా:- అవహితుఁడవు కమ్ము.

అవి:- అవహితుఁడనై యున్నాను.

విద్యా. - (కుడిచేతివ్రేలికిఁ బెట్టుకొని) మిత్రుఁడ! నీకు నే నగుపడు చున్నానా?

అవి - మిత్రుఁడ! నీడయేని గనఁబడుటలేదు. శరీర మెట్లు గనఁ బడును? లోకమందు సుఖవంతు లిట్టివారే కదా!

వ. *విలసితమంత్ర శక్తి నొకవేళ దిరోహితులౌచు నొందువే*

తల విప్పతాంగు లౌచును విలాసముతో వనితాసహాయులై

మెలఁగుమ శైలశృంగముల మింటను నెవ్వరు సంచరింతు రా
యలఘులె సౌఖ్యవంతులుఁ గృతార్థులు వారలె సర్వ వేత్తలున్.

కానీ! నేనీయంగుళీ సాహాయ్యమునఁ బ్రవేశించెదను.

విద్యా - (ఉంగర మెడమచేతికిఁ బెట్టుకొని) అట్లైన నుంగరముఁ దీసికొమ్ము.

అవి - (తీసికొని) అనుగ్రహింపఁబడితిని.

విద్యా - కాదు కాదు. నేనే యనుగ్రహింపఁబడితిని. ఏలయన-

క. *తనకడ రత్నముగలదని*
తనియఁడుసుమి సజ్జనుండు దానిన్మదిఁ గో
రిన పాత్ర యాచకునకున్
వినయముతో నిచ్చి మిగుల వేడుక చెందున్

అవి - నాకొకటి సంశయము కలదు. ఇది నాశరీరము మీఁదఁ బెట్టి పరీక్షించిన యెడల నెట్లుండునో చూడవలయును.

విద్యా - అట్లైన నీకుడిచేతివ్రేలికిఁ బెట్టుకొమ్ము.

అవి - మంచిది. (కుడచేతివ్రేలికిఁ బెట్టుకొనును.)

విద్యా - మిత్రుఁడా! కత్తిపుచ్చుకో.

అవి - మంచిది (ఖడ్గము పుచ్చుకొని విస్మయముతో) అహో! యేమి యీఖడ్గము యొక్క ప్రభావము.

తే. గీ. *అశని ప్రచ్ఛన్న రూపంబు నందెనొక్కొ*
మెఱుపు ఖడ్గీకృతంబయి మెఱయునొక్కొ
రవికృతం బైనదీప్తిఁ దిరస్కరించి
యాక్రమించెను దావాగ్ని యడవి నెల్ల.

విద్యా - అహో! యేమి యీ యగ్ని పుత్రుని వీర్యము. ఈఖడ్గము యొక్క ప్రభావము విద్యాధరులలో నైనఁగొందఱు మాత్రమే సహింపఁగలరు. భగవానుఁడైన యగ్ని దేవుఁడే యీతని రక్షించుచున్నాడు.

అవి - (ఖడ్గముఁజూచి) అహో! విద్యాభగవతుల ప్రభావములు

తే. గీ. *దివ్యమగు ప్రభావంబు నొందితిని నేను*
నంతియే కాదు దివ్యుండ నయితినుమ్మి
సాధుగుణవిశిష్టులు గాని జనము లింక
నెఱుఁగఁజాలరు నా దేహ మెదుట నున్న.

మిత్రుఁడా నాపనియైనది. ఖడ్గము పుచ్చుకొ.

విద్యా – సరె నీయిష్టము. ఈయుంగరము దాల్చి యతఁడే గాక తాల్చిన వానిం దాఁకినవాఁడును, వానిం దాఁకిన వాఁడును గూడఁ గనఁబడరు. ఇది నిశ్చయము.

అవి ---మిత్రుఁడ! సంతసించితిని. ఇది యభ్యుదయముకంటె నభ్యుదయము. మిత్రుఁడ! నానిమిత్తము నీకాలస్య మైన దనుకొను చున్నాను. ఇప్పుడు వేళాతిక్రమణము కాఁగూడదు.

విద్యా – సరె, నీ సెలవయిన యెడల నేను బోయెదను.

అవి – వేయిమాటలేల?

తే. గీ. *అనఘచరితా మీవంటివిద్యావతులకు*
సేయఁగలమె ప్రత్యుపకృతి జిన్న దైనఁ
బ్రాణ మిడుట నమ్ముడుబోలి నయ్య నీకు
భృత్యుఁడను జేయఁ బనుపు నీప్రియ మదేమి.

విద్యా – నీబుద్ధి నిష్కపట మైనదని యెఱుఁగుదును. నీవు నామాట ననుసరింపఁ దలఁతు వేని –

చం. *నెనరున నన్దలంపు మెద నీప్రియురాలికి నాదు ప్రేయసిన్*
నను నెఱిఁగింపుమీ గరుణ నాగతులం గనిపెట్టుచుండు మీ
జనపతిపుత్రి నాటలరసంబులఁ గొఁతుకవార్తఁ దెల్పుమీ
పని గలయప్డు నే నటకు వచ్చి మెలం గెద నీదుసన్నిధిన్.

ఆహా! పురుషస్వభావ మెటువంటిది. నాకు నిన్ను విడువ మనస్సు పుట్టుట లేదు. మిత్రుఁడా! మేము వెళ్లుచున్నాము.

అవి --- సరె. మీరు వెళ్ళుఁడు. పునర్దర్శన మగుఁగాక!

విద్యా - మంచిది.

(ప్రియురాలితోఁగూడ విద్యాధరుఁ డెగురుచున్నాఁడు)

అవి - (పైకిఁజూచి) అదిగో! పూజ్యుఁ డైన మేఘనాదుఁడు గగనార్ణవమునఁ బ్రవేశించినాఁడు. ఇతఁడు -

సీ. *అనిల వేగముచేత నగ్ర కేశంబులు*
మిగుల నక్కజముగ నెగురు చుండ
మేఘము ల్పలుమాఱు మేనితో నొరయుటఁ
గమ్మని మైపూఁత కరఁగిపోవఁ
గుడిచేతితోడ నెన్నడుముగట్టిగ బట్టి
వెనువెంటఁ బ్రియురాలు వెడలుచుండ
మకుట సంస్థితలసన్మాణిక్యరుచులు తా
రలకాంతిఁ గరముఁ దిరస్కరింప

తే. గీ. *నుత్తరీయంబు చలియింప నురుకృపాణి*
మొలను దట్టితో బిగఁ గట్టి పోవుచుండె
నంత కంతకుఁ జవమున నల్పమైన
యాకృతిని దాల్చె ఘనుఁడు విద్యాధరుండు.

ఈమెయు విద్యాబలమున మగని ననుసరించు చున్నది.

వ. *జవమునఁ గొప్పు వీడి యురుచక్కియలం జరియించు చుండఁ జ*
న్గవ పెను వ్రేగువే ననదుఁగా ననియాడఁగ నిండుకూర్మి మై
ధవుఁ డీడుపూర్వకాయమును దప్పక కేల గ్రహించి మబ్బుల
న్గవిసినక్రొమ్మెఱుంగుగతిఁ గన్పడి పై దలి యుట్టె మాయ మౌ

పూజ్యుఁడైన మేఘనాదుఁడు వెళ్ళిపోయినాఁడు. నేనును నేఁడె నగరాభిముఖుఁ డనై పోయెదను. సరె, కొండ దిగియెదను (దిగి) అబ్బా! అలసిపోయితిని. కాని, యీఁజాతిమీఁద నొక్క ముహూర్తము కూర్చుండి పిదప వెళ్ళెదను. (కూర్చుండును.)

(అప్పుడు విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు)

విదూ - అహో! యేమి పూజ్యుఁడు సుగృహీతనామధేయుఁడునగు సౌవీర రాజుయొక్క దురదృష్టము. చిరకాలము సంతాన హీనుఁడై నిజనియమ విశేషములచేతను బరమేశ్వర ప్రసాదంబులచే తను మనుజలోక దుర్లభుఁడైనసత్పుత్రునిఁ బడసియు పెండియు సంతానహీనుఁడే యయ్యెను. నా కంత్యకాల మాసన్న మగుటచేతను బంధుజనుల భాగ్యదోషముచేతను రాజకుమారుఁ డిట్లు పరిభ్రష్టుడయ్యెను. రాజకుమారుఁడు క్షేమముగా వెళ్ళినాఁడని నేఁడెకదా రాజపుత్రిక చెప్పినది. అతిసుకుమారుఁడైన రాజకుమారుఁడు మదనార్తుఁడై యేకాకియై పరిభ్రష్టుఁ డైనప్పుడు కుశలముగా నున్నాఁ డని యెవ్వఁడు చెప్పఁగలఁడు? నేనీ ప్రపంచ మంతయు సంచరించి మా రాజకుమారుని గాని యతనిశరీరమునుగాని చూచి తీరెదను. అట్లు చూడఁజాలనినాఁడు పరలోకమునకైన నేగి యతనికి సాయము చేసెదను. అబ్బ! యలసిపోయితిని. కానీ, యీ చెట్టు నీడ నొక్క గడియ విశ్రమించి వెళ్లెదను.

(నిద్రించుచున్నాఁడు)

అవి - సంతుష్టుని యొక్క యవస్థ యెట్టిదో కదా! నేను సుఖముగా నంతిపురి విడిచిపోయినానని యతఁడు విన్న పక్షమున మంచిది! వినని యెడల పాప మా బ్రాహ్మణుఁడు నిష్కారణముగఁ జచ్చిపోవును. అతఁడు లేనియెడల నాప్రయత్నము లన్నియు వ్యర్థము లగును. అతఁడు -

తే. గీ. *ఆలమున జోదు, గోష్ఠిలో హాస్యరసము*
అరులయెడ సాహసుఁడు, శోకమందు గురుఁడు,
పలుకు లేల నా హృద యోత్సవంబ యతఁడు
రెండుభాగము ల్గద నాశరీర మరయ.

(అంతటఁజూచి) ఎవఁడో బాటసారి యీ చెట్టు నీడను బండుకొన్నాఁడు.

(సమీపించి) నాహృదయమున కభ్యుదయము దైవవశమునఁ గలిగినది. ఇతనిం గౌఁగిలించుకొనుటకు నామనము తత్తరపడుచున్నది.

విదూ - (మేలుకొని) అబ్బ! చాలసేపు నిద్రపోయితిని. ఇఁక వెళ్ళిపోయెదను. విభ్రష్టమనోరథులకు విశ్రాంతి యుండునా. (అవి మారకునిఁ జూచి) ఏమి! పూజ్యుఁడై నయవిమారకుఁడా.

(ఒండొరులం గౌఁగిలించుకొనుచున్నారు).

విదూ - (పక్కుననవ్వి) ఓ మిత్రుఁడ! యింతకాలము నీవేమి చేసితివో చెప్పు?

అవి - మిత్రుఁడ నేనుచేసిన దిది - (అని ఉంగరము కుడిచేతి వ్రేలికిఁ బెట్టుకొని మాయమగుచున్నాఁడు)

విదూ - హా! హా! మిత్రుఁడా నీవెక్క డున్నావు? ఏమిది! కనుపడఁడు. అతనిమీఁదనే ధ్యానము పెట్టుకొని యతఁడు కనఁబడి నాఁడని భ్రమపడితిని గాఁబోలు! కాదు కాదు. స్ఫుటము చేసెదను. ఓ మిత్రుఁడ! నీవు దాఁగితివా గట్టియొట్టు పెట్టెదను.

అవి - మిత్రుఁడ! ఇదిగో నేను.

విదూ - ఎక్కడ! ఎక్క డున్నావు?

అవి - (ఉంగర మెడమచేతికిఁ బెట్టుకొని) వయస్య! ఇదిగో నేను.

విదూ - మొట్టమొదట నిజమైన యవిమారకుఁడు కనఁబడెను ఇప్పుడు మాయావిమారకుఁడు కనఁబడుచున్నాఁడు. ఓయీ మాయా విత్తక! ఇన్ని మాయలు నేర్చినవాఁడవు. నీవేల కన్యాంతఃపురమందు బ్రచ్ఛన్నరూపముతో సంచరింపలేదు. -

అవి - మిత్రుఁడ! ఇప్పుడే కాదా యిది లభించినది.

విదూ - ఆశ్చర్య మాశ్చర్యము. ఇ దిప్పు డెక్కడనుండి వచ్చినది?

అవి - ఆవృత్తాంత మంతయు నంతఃపురమందుఁ జెప్పెదను.

విదూ - ఇప్పుడు నాకాఁకలి యగుచున్నది.

అవి - మూర్ఖుఁడ! నీవు త్వరగా రా. భోజన శాలకుఁ బోవుదము. నా చేయి విడిచి పెట్టకు.

విదూ - ఆశ్చర్య మాశ్చర్యము. నేనుఁగూడ నదృశ్యుఁడ నై నాను. నాశరీర మిప్పు డున్నదా లేదా? ఉమ్మివైచి చూచెదను. నా శరీరము మీఁదఁ బడునో లేదో. థూ. థూ.

అవి - మూర్ఖుఁడ! అట్లు చేయకు చేయకు. మన మిప్పు డాలస్యము చేయవద్దు. కాంతాసందర్శనార్థము నా మనము తత్తరపడుచున్నది.

(విదూషకుని లాగుచున్నాఁడు.)

విదూ - నాకంతతొందర లేదు.

అవి - మూర్ఖుఁడ! భోజనమునకైన నీకుఁ దొందరలేదా?

విదూ - ఉన్నది కాని కొంచెము కాలము విశ్రమించిపోవుదము.

అవి - కురంగి నన్నుఁ దలఁచు కొనుట లేదా?

విదూ - ఆనగ్నాంధశ్రమణిక యింకను బ్రతికియున్నదా?

అవి - మిత్రుఁడ! నేను వేఁడుకొనుచున్నాను. త్వరగా రా.

విదూ - గర్భాధానమునకుఁ బోవు బ్రహ్మచారివలె నీ వింత తొందరపడు చున్నా వేమి?

అవి - మూర్ఖా! యిటు రా.

విదూ - నన్ను లాగకు. వెంట నడిచెదను.

అవి - (నడచి) ఇది నగరము.

విదూ - ఈనగరశోభను జూచుచున్నాను.

అవి - ఇది రాజగృహము.

మ. *మును పేరాజగృహంబు రాతిరి భయమ్ము న్పొందుచున్ నిమ్మనం*
బున నే సాహసవృత్తిఁ జొచ్చితినొ యాభూపాల గేహంబె నేఁ

డనుమానంబుఁ దొఱంగి పట్టపగలే యత్యంతమాయాబలం
బున నేఁ జొచ్చెద జ్ఞాని పండితగణంబుం జొచ్చుచందంబునన్.

(నడచి) కురంగి స్నానముచేసి యీ పాటియప్పు డీ మేడమీఁదఁ గూర్చుండును.

విదూ -- ఎక్కడో యొకచోటఁ బ్రవేశింతము రమ్ము. భిక్షాకాల మతిక్రమించుచున్నది.

అవ - రా. అభ్యంతర మందిర మె ప్రవేశింతము. (ప్రవేశించి)

ఇక్కడ -

వ. *మునుపు పురంబు నంటిపురమున్ నిలయం బయి యుండెడిన్*
మన
స్వినులకు దుర్వియోగమున వేఁగెడు వారికి నిప్పుడన్నన్
యనయము సంతసించెడు కృతార్థులకున్ సుకృతంబు లాచరిం
చినమహనీయమూర్తులకుఁ జిత్రముగా నిది తానకం బగున్.

(నిష్క్రమించుచున్నారు.)

ఇది చతుర్థాంకము.

****

అవివాహరకవము

పంచమాంకము

(అప్పుడు కురంగియు నళినికయుం బ్రవేశించుచున్నారు.)

నళి - భర్తృదారికా! సంతాపము చాలించు. కన్యాపురప్రాసాద మెక్కి కనులకు వేడ్క చేసికొందము.

కురం - సఖీ! నీవు నా హృదయము నెఱిఁగితివాయేమి. ఓసీ! పరిజను లెఱుఁగక వర్ష కాల రమణీయము లయి, సెత్తావులు వెదఁజల్లువకుళ సరళ సర్జార్జున కదంబ నీప నిచుళ ప్రభృతి పుష్పములను దిచ్చి నా కున్మాదము గలిగించిరి. ఈనెమిళ్ళు రాజకుల మానసంబున నతి పీఠ మర్ద భావము జేయుచున్నవి. అవి మన చేతఁ బలుమాఱు లాలింపబడిన వయ్యు దేశ కాలపరిజ్ఞానము లేక సర్వజ్ఞత్వముఁ బూని యున్నట్లు కనఁబడుచున్నవి. శుక శారికలును వ్యాఖ్యానము సేయుట కారంభించినవి. మంత్రియైన భూతికుని యొక్క శారికకూడ నానెవ్వగ నెఱుఁగక సర్వలోక వృత్తాంతము జెప్పుదు నని వచ్చినది. నారోగ మెట్లున్నదని యడిగి పరామర్శచేయ వచ్చిన జనము సైతము నన్ను బలవంత పెట్టి యేదోగాడువ చెప్పుదురు. అందుచేత నొక్క ముహూర్తము మేడ మీఁదం గూర్చుండఁ గోరుచున్న దానను.

నళి - సరె! నీ కేది యిష్టమో యది చేయుదము.

(ఇద్దఱు మేడ నెక్కుచున్నారు.)

కురం - సఖీ! యిక్కడఁ గూడ మహోన్నతమే దాపుర మైనది. మెఱుపుదీపము ధరించి కాలమేఘము సిద్ధ మయినది.

నళి - భర్తృ దారికా! బెంగ పెట్టుకొనకు. చూడుచూడు! క్రొత్తమబ్బులచేత నరికట్టఁబడిన సూర్యమండలముగలిగి రాలుచున్నసన్న చినుకుతో నాకాశ మెంత రమణీయముగా నున్నదమ్మ.

కురం - చూచుచున్నాను. ఆకాశ మెంతో రమణీయముగా నున్నది నిజమే.

(అంతట నవిమారకుఁడువిదూషకుఁడుఁ బ్రవేశించుచున్నారు.)

అవి – మిత్రుఁడ! ఆకురంగి కనఁబడినది. ఈమె –

ఉ. *రోగముచేత నీలలన రూఢిగ నెమ్మెయిఁ బూయ కున్నఁగా*
లాగురుచందనంబులు, నిజాభరణంబులు దాల్ప కున్న, బల్
వేఁగుచు హావభావములు వీడిన, హేతువివర్జితంబు లో
నాగముముల్ బలెం దనరు నౌర! నిసర్గమనోహ రాంగియై.

విదూ – అహో! సంతుష్టుఁడ నైతిని. నీవు సర్వలోకములందు నేనే చక్కని వాఁడ నని గర్వించు చున్నావు. స్వభావ రమణీయ మైన యామె రూపము చేత నీ విప్పుడు జయింపఁబడినావు. నీ వియోగముచేత నీమె చిక్కినదని తలంచెదను. ఇట్లున్నను నీమె బాలచంద్ర రేఖ వలె కనుబండువు సేయుచున్నది.

అవిమా – మిత్రుఁడ! నీ వతిపండితుఁడ వైనాఁడవే. ఏమీ యీ యాశ్చర్యము!

విదూ – ఓయి! నిత్యపరిచయము చేత నీవు నన్ను వేళాకోళము చేయుచున్నావు. కాని, క్రొత్తవాఁడు నన్ను చూచిన పక్షమున నా సంగతి యెఱుఁగక గొప్ప బుద్ధిమంతుఁడ ననుకొని ప్రశంసించును. ఈ సంగతి నే నెఱిఁగి యీ నగరమం దెవరితోను సహవాసము చేసి గుట్టుబయటఁ బెట్టుకొనలేదు.

అవి – చాలు! నీ యుదాసీనభావము చాలు! ప్రియురాలు బహుజన పరివృత యగుటచేత మనరాక దెలియఁజేయుటకు సమయము చిక్కకున్నది. అందుచేత నిప్పుడామె మేడమీఁద నున్నను మన మక్కడికి పోయి పలుకరింతము.

విదూ – నీవు లెస్సగాఁ బలికితివి. మేడ మీఁది కెక్కుదము.

అవి – మిత్రుఁడ! చప్పుడు కా కుండ నెక్కవలయును.

విదూ – అబ్బో! అది నాచేతఁ గాదు. అన్నము దిగబెట్ట కుండ నెవఁడు తినఁగలఁడు. నేనిక్కడనే కూర్చుండెదను. నీవే మేడ నెక్కు.

అవి – నిన్ను విడిచితినా నీవు మరలఁ గనఁబడుదువా?

విదూష - ఆమాట నేను మఱచిపోయితిని. తిరిగి చెప్పు!

అవి - ఇటురా! (అని యెక్కిచూచి) మిత్రుఁడ! యిదిగో నాప్రియురాలు నళినికతోఁగూడ శిలాతలమందున్నది. ఈమె -

చ. *వనటను దీన మోముగము వామకరంబునఁ జేర్చి కమ్మని*
ల్లునకు సహాయ కారి యయి దుర్భర మయ్యెడు వానకాలు నో
ర్వనిదయి బాష్పబిందువులు వారణ సేయఁగ బైకిఁజూచుమన్
ఘన మగుచింత నొందెడును గంజదళాక్షి యలోలదృష్టియై.

కురంగి - (తనలో) ఈజీవన్మరణముతో నేమి ప్రయోజనము? (ప్రకాశముగా) నళినికా! నీవుపోయి స్నానపరికరంబులు దీసికొని రమ్మని మాగధికతోఁజెప్పు.

నళి - అయ్యో! నిన్నొకతును విడిచి యెట్లు పోదునమ్మా. ఇక్కడెవరు లేరుగదా!

(అప్పుడు హరిణక ప్రవేశించు చున్నది.)

హరిణిక - భర్తృదారికా! జయము జయము. నీతలనొప్పి యే లాగున్నదో కనుఁగొని రమ్మని యమ్మగారు పంపినారు. ఈయౌషధము రాచికొనుమమ్మ!

కురం - నళినికా! నీ విప్పుడే వెళ్ళు. ఇప్పుడు వర్షము కురియు నని తోఁచుచున్నది. అభినవ మయిన యాకాశతోయముతో నేను స్నానము చేయఁదలఁచు కొన్నాను. కాఁబట్టి స్నానపరికరములను వేగము పంపు

నళి - అమ్మా! చిత్తము

అవి - ఈమె ప్రయత్నమేమి చెపుమ?

కురం - సఖీ! ఒక్కసారి యిటురా.

నళి - ఇదిగో వచ్చితిని.

కురం - సఖీ! నీశరీరము చల్లఁగా నున్నదా?

నళి - ఏమో నే నెఱుఁగను.

కురం - చెలీ! యిటువచ్చి నన్నుఁగౌఁగిలించుకో.

నళి - అట్లే చేసెదను. (అని కౌఁగిలించుకొను చున్నది.)

కురం – సఖి! నీశరీర మతిశీతలము నతిమనోహరము నైయున్నది.

నళి – నేను కృతార్థురాల నైతిని.

కురం – సఖి! ఇప్పుడు నాశరీరతాపము నశించిన ట్లున్నది. (స్వగతము) అమ్మయ్యా! సఖీప్రణయ మైనది. ఈమె శరీర సంసర్గము సమాప్తమైనది. (ప్రకాశముగా) నీ వికఁ వెళ్ళు.

నళి – నీయిష్టము వచ్చినట్లు చేసెదను.

హరి – భర్తృదారిక! అమ్మగారితో నేమని మనవి చేయుదును.

కురం – మీయమ్మాయి విగతరోగ యైస్వస్థయైనదని చెప్పుము.

హరి – నీకెట్లు తెలిసినదని యామె యడిగినచో నేమని విన్నవింతును?

కురం – ఔషధవిశేషముచేత బాధ నివారణ మైనది. నేను చక్కగా నెఱుఁగుదునని చెప్పు.

హరి – అమ్మా! చిత్తము.

అవి – ఈమె ప్రయత్న మేమిచెపుమ!

గీ. *వేఁడినిట్టూర్పు పలుమాఱు విడువఁజొచ్చె*
నశ్రుపూర్ణ నేత్రములతో నన్ని దెసలు
మాటిమాటికిఁ బరికించు, మౌనమూని
యేమి సేయంగ, దలఁచెనో యిగురుఁబోఁడి.

కురం – (తనలో) సరి! ఉత్తరీయము మెడకురిపెట్టుకొని మృతినొందెదను. (లేచి యట్లుచేసి యుఱుముచప్పుడు విని భయపడి) అమ్మో! రక్షింపుము. రక్షింపుము, (అని పడుచున్నది.)

అవి – మిత్రుఁడ! ఇఁక మీఁద నుపేక్షింపఁగలమా. (ఉంగర మెడమచేతికిఁ బెట్టుకొని) ప్రియురాల! భయపడకు భయపడకు.

(అని కురంగిని లేవఁదీయుచున్నాఁడు.)

కురం – (సంతోషముతో) ఏమిది! ఇది నిజమేనా? నేను మూఢురాల నైనట్లున్నాను.

అవి - ప్రియురాల! సంశయము విడువుము. (కౌఁగిలించుచున్నాఁడు.)

కురం - ఆశ్చర్యము! ఒక్క క్షణములో నాశరీరతాప మంతయుఁ బోయినట్లున్నది.

అవి - ఈమెయాలింగన మెంతసౌఖ్యప్రదమ్మై యున్నది!

చ. *నిరతమనోభియోగమున నీరజలోచన నాకు నెంతయుం*
బరిచిత యయ్యు నెమ్మనమునం దొలికూటమియందుకంటెఁ గూ
ర్చి రసవిశేషముల్, పుడమి రేనికి సాహసబద్ధమైన సం
గరజయలక్ష్మి వోలె నధికప్రమదం బిడు నీ మె నా కిటన్

విదూ-ఈమె యేడ్పుటకు మొదలు పెట్టినదా యేమి? అతి మాత్రసంతాప మెందుకు? అట్లయిన నేను గూడ నేడ్చెదను. నాకంటినుండి యొక్క నీటుచుక్కయైన రాలకున్నది. నేనెట్లేడ్వఁగలను? మా నాయన చచ్చిపోయినప్పుడు నే నెంతో ప్రయత్నముచేసి యేడుపు తెచ్చుకొంటిని. ఒక్క బాష్పబిందువైన రాలేదు. తండ్రి చచ్చినప్పుడే లేని దుఃఖ మిటువంటి సమయములో వచ్చునా? సరి! ఏలాగో యొక లాగునఁ గష్టపడి యేడుపు దెచ్చి కొని విచారించెదను.

అవి - అతిపరిహాసము చాలించు. స్నేహ మనఁగా నిర్వ్యాజమైనది కదా?

చ. *సమయమెఱుంగకుండ విరసంబుగ హాస్యము చేయు మంట మి*
త్రమ కడుదూషణీయముగు తావకబుద్ధి నిజంబ కార్యయో
గమున వివేక బాలిశుల గాత్రములుండు సమానరీతిగాఁ
గ్రమమున వారిబుద్ధుల వికాసముమాత్రము భేద మయ్యెడున్.

(అప్పుడు నళినిక ప్రవేశించుచున్నది.)

నళిని - హరిణికా! హరిణికా! ఏమే తలుపు మూసియున్నది? అయ్యో! యెంతకష్టము. తలుపుమూయుటచేత నీమె తన్నపగతసంతాపురాలుఁగాఁ జేసికొనుచున్న దని తలంచెదను. హరిణికా! హరిణికా! అయ్యో! అయ్యో! అంతపని యైయుండును.

అవి - కంఠ ధ్వని నళినికదివలె నున్నది. మిత్రుఁడా! తలుపుతీయుము.

విదూ - నీచిత్తము వచ్చినట్లు చేయుదును. (తలుపు తెఱచి) మహానుభావురాల! రా! రా!

నళి - అమ్మో! యిప్పు డీపురుషుఁ డెవఁడు?

విదూ-ఆహాహా!ఎంత చక్కఁగాఁ దెలిసికొంటివి. ఓహో! రాజభవనమందుం డుట చేతఁ గలిగిన తెలివితేటలు గాఁబోలివి. నన్ను జూచి పురుషుఁడని యెవరనుకొనుదురు? నే నాఁడు దాననుగాని మగ వాఁడను గాను.

అవి -నళినికా! ఈవలకు రా.

నళి - ఓహో! భర్తృదారకుఁడా? రాజకుమార! నమస్కారము. అయ్యా! యీపురుషుఁ డెవఁడు?

విదూ - నేను చేటిని. నా పేరు పుష్కరిణి.

అవి - సంతుష్టుఁడను సఖుఁడు నాకొకఁడున్నాఁని పలుమాఱు మున్ను చెప్పుచు వచ్చితినికాదా! అతఁడే యీ బ్రాహ్మణుఁడు.

నళి - ఔనౌ! నీ బ్రాహ్మణుఁడు మున్నొకసారి నాకు నగరాపణాళిందము నందుఁ గనఁబడినాఁడు.

విదూ - ఔనౌను! యజ్ఞోపవీతముచేత నేను బ్రాహ్మణుఁడను; చీవరముచేత రక్తాంబరుఁడను. గుడ్డవిప్పితే శ్రమణకుఁడను. నీచేతిలో దేమిటి?

నళి - ఉపస్నానము భర్తదారికనిమిత్తము తెచ్చితిని.

విదూ - ఆఁకలిచేత నేడ్చుచున్న రాజపుత్రికకు నీయుపస్నానమెందుకు? త్వరగా వెళ్ళి భోజనము తీసికొనిరా! నేనీయగ్రపీఠమందుఁ గూర్చుండెదను.

నళి - ఓయీ బ్రాహ్మణబ్రువుఁడ! ఇదికూడ భోజన మనుకొనుచున్నావా? అదియెల్ల నటుండనిమ్ము. అనేక పురుష సంపాతము గల రాజమార్గమున నెట్లు పట్టపగలే భర్తృ దారకుఁడు వచ్చి యీమందిరముఁ బ్రవేశింపఁగలిగెను?

అవి - అది యంతయు సంతుష్టుఁడె నీకుఁ జెప్పఁగలఁడు.

నళి – ఈ బహుమానవచనము వెఱ్ఱుమని నాకు సెలవొసంగుటి. సరి! యితనిం దీసికొని చతుశ్శాలంబొచ్చి గోష్ఠిజనముతోఁగూడ నితనివలన వృత్తాంత మంతయు వినియెదను. బ్రాహ్మణుఁడ రారా!

(అని లాగుచున్నది.)

విదూ – అబ్రహ్మణ్య మబ్రహ్మణ్యము.

కురం – ఈ బ్రాహ్మణుఁడు హాస్యగాఁడు.

అవి – మిత్రుఁడ! నీవెగతాళిపా లగుచున్నావు.

విదూ – నే నెగతాళిపా లగుట లేదు. ఈమె యెగతాళి పాలగుచున్నది. ఎందుచేతననఁ దనయవస్థ తెలిసికొని యేదో చేయఁబూనిమేఘగర్జనము విని యంతయు మఱచి నేలఁ జదికిలఁబడినది.

కురం – అయ్యో! ఇది యీయనకూడ చూచినాఁడు కాఁబోలు!

నళి – అయ్యా! బ్రాహ్మణుఁడ! రావయ్యా. నిన్ను వేఁడికొనుచున్నాను.

విదూ – భోజనము పెట్టుదు వేని నేను నీ వెంట వచ్చెదను. ఆగంతుకునకు భోజనదానమే కద యిష్టము.

నళి – భోజనమే కాదు. నాసర్వాభరణము లిచ్చెదను రావయ్య

విదూ – నెయ్యి పేరు చెప్పిన మాత్రమునఁ బైత్యము నశింపదు. ఇయ్యఁదలఁచుకొన్న దేదో నాచేతిలోఁ బెట్టు.

నళి – అట్లే చేయుదును. (నగలు తీసి యిచ్చుచున్నది.)

విదూ – ఇదిగో విను.

నళి – ఓయీ! మూఢ బ్రాహ్మణ! చతుశ్శాలఁ బ్రవేశించి గోష్ఠిజనముతోఁ గలిసి నీవృత్తాంతము విందును రా.

విదూ – సరి! పూజ్యురాలైన యామె సెలవుగ్రైకొనివచ్చెదను.

నళి – ఇఁక రాక పోవుటకు నీ కేమధి కారమున్నది? నా నగలన్నియుఁ బుచ్చికొని నాకు మగఁడవైతివి. తత్క్షణమే రా! (విదూషకునిఁ జేతితోఁబట్టు కొనుచున్నది.)

విదూ - ఈ లాగున లాగకు! లాగకు! నేను మిక్కిలి సుకుమారుఁడను.

నలి - ఎఱుఁగుదు నీసుకుమారత్వ మెఱుఁగుదు. సుకుమారుఁడ వైతివేని త్వరగా రా!

విదూ - ఇదిగో వచ్చుచున్నాను.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

అవి - ప్రియురాల! చూడు! పరమదర్శనీయములై ప్రావృట్కాలవల్లభములై యున్న యీ మేఘములం జూడుము. -

సీ.మా *ప్రావృణ్మహాఘోషణాడంబరానేక*
రూప క్రియలు గల్గి రుచిరములయి
యింద్రదత్తంబులై నృత్తగీతంబులఁ
బ్రోడలౌ విలఁదులపోల్కి నొంది
చుక్కల పేరిఁటి చక్కెర బోఁడులు
దాఁగెడు తెర లయి దనరుచుండి
పాలయల్కలనుదాల్చుపాలఁతిమిన్నలకు న
ల్కలు దీర్చి సంధిపాలకము లగుచు
సర్వ శైలంబుల స్నానంబుచేయించు
బెడిదంబు లౌ నీటికడవ లనఁగ
మెఱపుపాములు దాఁగు మేటి పుట్టలనంగ
నాకసంబున మొల్చు మోక లనఁగ

గీ. *ప్రసవబాణ బాణ నిశాణ ఫలకములన*
వారి రాశి సలిల భైక్షహారవములు
అమరయంత్ర ప్రవలిన వంద్రార్గళములు
కాఱుమబ్బులు కూర్చెడుఁ గౌతుకంబు.

కురం - ఇప్పు డివి మిక్కిలి దర్శనీయము లైనవి.

అవి - అహో! ఏమియాధారల విపులతయు విరళతయు.

తే. గీ. *మొగిలు గగనార్ణవోర్ములపగిది మెఱయు*
నంబుదప్రరోహములట్టు లమరె ధార
లసుర కాంతల బొమలట్టు లలరు మెఱుపు
లంబుదకుచమర్దన యోగ్యయౌవన మిది.

కురం - ఆర్యపుత్ర! మేఘుఁడు వర్షించుట కారంభించినాఁడు.

అవి - ప్రియురాల! రమ్ము. అభ్యంతర మందిరమునకుఁ బోదము.

కురంగి - (సంతోషముతో) ఆర్యపుత్రుఁడు సెలవిచ్చినట్లే చేసెదను.

(ఇరువురు నిష్క్రమించుచునారు.)

****

అవివహారకవము

షష్ఠాంకవము.

(అప్పుడు దాది ప్రవేశించుచున్నది.)

దాది - అహో! విధినియోగము లెంత నియమరహితములు ఏలయన రాజపుత్రికను మొట్టమొదట సౌవీరమహారాజాగారు తమ్ము కుమారుఁడైన విష్ణుసేనున కిమ్మని కోరినారు. ఇప్పుడు జాతి యేదో తెలియని మానుషలోక దుర్లభాకృతి విశేషము గల యొకానొకనితో నామెకు సంయోగము కలిగినది. నేఁడు కాశిరాజపుత్రుఁడైన జయవర్మను సుదర్శనా దేవితోఁగూడ మంత్రియైన భూతికుఁడు తోడ్కొని వచ్చి యంతఃపురమునందుఁ బ్రవేశపెట్టినాఁడు. కాశిరాజు యజ్ఞవ్యాపారమునం దుండుటచేత స్వయముగా రాఁజాలక పోయెను. ఇది యేమగునో కదా!

(అప్పుడు వసుమిత్ర ప్రవేశించుచున్నది.)

వసుమిత్ర - అహో! జ్యోతిష్కులు విషమస్వభావులు కదా? తమ ముహూర్త విశేషమునే యెక్కువగాఁ బాటింతురు. కాని, పని తొందర నెంతమాత్రము లెక్కసేయరు. పెండ్లికుమారుఁడు నేడే వచ్చినాఁడు. వివాహముకూడ నేఁడే నిశ్చయింపఁబడినది. ఏమిది! దాదియైన జయద యప్రసన్నయై యేదో చింతించు చున్నట్లున్నది. జయద! అమ్మగారు నిన్ను రమ్మని సెలవిచ్చినారు.

దాది - ఎందుకో యెఱుఁగుదువా?

వసు - మఱెందుకు. ఈ కార్యమునుగుఱించి యాలోచించుటకే

దాది - ఇప్పు డమ్మగారి యభిప్రాయ మేమి?

వసు - తనవంశస్థుఁడైనవిష్ణుసేనుని యొక్క యవస్థ దెలియక పోవుటచే బిడ్డను జయవర్మ కిచ్చుట కిష్టపడకున్నది. మహారాజాగారును సౌవీర రాజపుత్రునిజాడ తెలియక యధికసంతాపము నొందుచున్నారు.

(అప్పుడు నళినిక ప్రవేశించుచున్నది.)

నళిని – కష్టము లన్నియు నేదో సంకేత మేర్పఱచుకొని యొక్కసారిగా వచ్చిపడిన ట్లున్నవి. ఏమిది! మాయమ్మ వసుమిత్రతోఁగూడ నేదో యాలోచించుచున్నది. ఈమెను సమీపించి కష్టవృత్తాంత మేమో వినియెద.

వసు – సఖి! నళినికి! యిటు రావె. కంచుకిసహవాసముచేత నీ వంతఃపుర వృత్తాంతము లెస్సగా నెఱుఁగుదువు.

నళి – క్రొత్తవిశేష మొకటి యున్నది. అది మీకు దెలుపుటకే నేను వచ్చితిని.

వసు –అమ్మాయి! చెప్పు.

నళి – సౌవీర రాజుయొక్క మంత్రులు మనమహారాజుగారి యొద్దకు దూత నొక్కనిఁ బంపిరి. ఆదూత యిట్లు మనవిచేసెను. "మామహారాజుగారు మీనగరమునందు సపుత్ర దారకళత్రముగఁ బ్రచ్ఛన్నముగ నున్నారని మా వేగులవాండ్రు చెప్పిరి. అవృత్తాంతము మీరు చక్కఁగాఁ బరిశీలించి కనిపెట్టవలయు".

ఉభయులు – ఏమి! ప్రచ్ఛన్న వేషముతో నున్నారనియా. తరువాత తరువాత?

నళి – అవి యెల్లవిని యతఁడిచ్చినజాబు చివరంటఁ జూచికొని మన మహారాజుగా రార్యభూతికుని వెంటఁ బెట్టికొని వారిని వెదుకం బోచ్చిరి.

దాది – ఏమగునో చెప్పుమా?

వసు – సరే! నీవంతఃపురమునకుఁ బొమ్ము

నళిని – అట్లే పోయెదను.

వసు – సరి మనముఁగూడఁ బోయి యమ్మగారి దర్శనము చేయుదము రమ్ము.

దాది – అట్లే చేయుదము. (ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రవేశకము.

(అప్పుడు సౌవీరరాజ భూతికులతోఁగలిసి కుంతిభోజుఁడు ప్రవేశించు చున్నాఁడు.)

కుంతి -

మ. చిరకాలంబు గతించె నిన్నని సఖా చింతింపుమీ శైశవ
స్ఫురితస్నేహము కౌఁగిలింపవె ననున్ భూపాల! గాఢంబుగాఁ
బరమప్రీతిని జెప్పపా టొదవకుండన్ నిన్ననన్ చిత్తము
బ్బురపుం దొందర నొందె మైత్రియు నవీభూతంబుగా దోఁచెడిన్

సౌవీ - నీయిష్టము వచ్చినట్లు చేసెద (అని కౌఁగిలించుకొనుచున్నాఁడు)

కుంతి - తే. గీ. చింత గవియుట మతియెల్లఁ జెదిరిపోయెఁ
బలుకు గద్గదమయ్యె బాష్పహత మాటఁ
గలుష మయ్యెను గన్నీటికతన మొగము
హర్ష సమయంబున వికార మయ్యె నౌర.

సౌవీ - నీసమాగమముచేత నేఁడు మిక్కిలి ప్రహృష్టుఁడ నయితిని కాని పుత్రస్నేహము మిక్కిలి ప్రబల మైనది కదా?

తే. గీ. పుత్రవిషయ మౌ నాశోకపూర మెల్ల
హృదయగత మయి జృంభించె నిన్ని నాళ్ళు
నీసహాయంబు లభియించె నేఁడు గాన
బాష్పరూపంబు దాలిచి బైటఁబడియె.

కుంతి - పుత్రవిషయకశోక మేమి?

భూతిక - దేవరవారికిఁ దెలియదు కాఁబోలు! ఈయన కుమారుఁడు సంవత్సరమునుండి కనఁబడుట లేదు.

సౌవీ - పుత్రస్నేహము మిక్కిలి ప్రబల మైనది కదా! చూడు

తే. గీ. అసమరూపదోర్బలధుర్యు, నధిక శౌర్యుఁ
బుత్రు నవిమారకుఁ దలంచి పొక్కు చుంటి
నతఁడు తావకపదరజోంచితశిరస్కుఁ
డైన నాకంటె నవని ధన్యాత్ముఁ డెవఁడు.

భూతి - (తనలో) కుమారుని వియోగము చేత నీతఁ డధికసంతాపము నొందుచున్నాఁడు. ఈయనను మఱియొక సంభాషణలో దింపెదను. (ప్రకాశముగా) దేవరవారి కీయాపద యెట్లు సంభవించినది?

కుంతి - మాటలసందడిచేత నేనును నావిషయ మడుగ మఱచి నాను.

సాపీ - ఇది భూతికుఁడే యెఱుఁగును. నానోటనే వినఁ గోరెదరేని వినుఁడు.

కుంతి - మేము సావధానుల మై యున్నాము.

సాపీ - ఎఱుగుదురుకదా! అతికోపి యైనచండభార్గవుఁడను బ్రహ్మర్షి యున్నాఁడని.

కుంతి - పూజ్యుఁడైన యాతపోనిధినిఁగూర్చి విన్నాఁడను.

సాపీ - ఆయన నాదేశమునకు వచ్చినాఁడు. ఆయనశిష్యుఁ డొకఁడడవిలోఁ పెద్దపులివాతఁ బడి మృతి నొందినాఁడు.

కుంతి - తర్వాత తర్వాత.

సాపీ- ఆకాలమునందే నేనును దైవవశమున వేఁటకై యా ప్రదేశమునకే పోయి యుంటివి.

కుంతి- తరువాత, తరువాత.

సాపీ- అతఁడు నన్నుఁ జూచి విజృంభమాణరోషంబున ముడివడిన కన్బొమలచేవదనంబు విషమీకృతంబుగా, జడ లూఁగుచుండ శిష్యునిమీఁదఁ జేయి వైచి క్రోధాగ్నిచేత దహింప జేయువాఁడుం బోలె నామాట వినిఁబెట్ట నిచ్చగింపకయే సంరంభంబున మాటలు తొట్రుపడ నన్ననేకవిధములఁ దిట్ట నారంభించెను.

కుంతి- తర్వాత తర్వాత.

సాపీ- తరువాత నేనును రాఁగల దురవస్థ యొక్క ప్రాబల్య ముచేత నోపిక లేనివాఁడనై మహర్షిం జూచి "వృత్తాంతము చెప్పుడు, ఊరక తిట్ట మొదలు పెట్టితి" వని కృద్ధుఁడనై పెండియు నిట్లంటి.

చ. *తెలుపవు వృత్త మేమియును దీవరరోసము బూని నన్నెడల్*
దెలియక యిచ్చవచ్చినటు దిట్టఁగఁ జొచ్చి త కారణంబుగాఁ
దలఁప మహర్షి రూపమును దాల్చి నమాలఁడ వౌదు గాని, వి
ట్టలుకను బూనియుండుట మహర్షివి మాత్రము గావు సుమ్మిఁకన్.

కుంతి:- నీ వసమానముగాఁ బల్కితివి.

సౌవీర:- అప్పలుకులు విని యనంతరం బతఁ డాజ్యధారావసిక్తుఁ డైన హుతాశన దేవుఁడుం బలెఁ గన్నుల నిప్పులం గ్రక్కుచుఁ బలుమాఱు శిరఃకంపము జేసి యెట్టెట్టు యెట్టి ట్టని పలుకుచు నిట్లు శపించెను.

తే. గీ. *మహితు బ్రహ్మర్షి ముఖ్యు న న్మాలఁ డంచుఁ*
గినుక చేతను నిట్లు బల్కితివి గాన,
దారపుత్రులతోఁ గూడ దప్పు కుండ
మాలవాడ వయ్యెదవు నా మహిమచేత.

కుంతి:- మహాపురుషుల యనర్థములకు మూల మల్పము గదా!

భూతి:- సౌవీర రాజకులముయొక్క యదృష్ట మింతవఱకు మంచిది.

తే. గీ. *అధికకోపసమావిష్టుఁ డమ్మహర్షి*
యంత్యజుఁడవు గమ్మని తిట్టె నంతె కాని
యమ్మహాగ్రహావిష్టరూపమ్ము తోడ
సర్వమును భస్మపటలంబు సలుపఁ డయ్యె.

కుంతి:- నీవు లెస్సగాఁ జెప్పితివి. తర్వాత తర్వాత.

సౌవీ:- అనంతరము నేను శాపప్రక్షుబ్ధమనస్కుఁడనై యమ్మహర్షిని మిక్కిలి బతిమాలుటయు నతఁడు మెల్లమెల్లఁగాఁ బ్రకృతి భావమునొంది యనుగ్రహించి యిట్లనియె -

క. *శాపవశంబున వత్సర*
మోపికఁ బ్రచ్ఛన్న వృత్తి నుండుము, పిదపన్
శాపవిమోచన మయ్యెడు
భూపాలక వత్సరంబు పూర్ణం బగుడున్.

ఇట్లు పలికి ప్రసన్న చిత్తముతో నోయి కాశ్యప! యిటురా యని తనశిష్యునిం బిలుచుటయు నంతకుమున్ను బెబ్బులిచేత మృతి నొందినబ్రహ్మవారి బ్రతికి లేచివచ్చెను. శాపప్రకారము నేనును జండాల వ్రతము సంవత్సరము సెఱపితి. ఇప్పుడు శాపవిముక్తుఁడనైతిని.

కుంతి:- అహో! మహాపదయొక్క ప్రవృత్తి నివృత్తులు చిత్రముగా నున్నవి. అదృష్టవశమున నీ విప్పుడు వర్ధిల్లుచున్నాఁడవు.

భూతి:- దేవ! జయము. జయము.

కుంతి:- ఓయి! విష్ణుసేనుని తల్లి సపరివారముగా నంతఃపుర ముఁ బ్రవేశించి నదా?

భూతి - అహో! యామె చిరపరిచిత మైన యాయంతఃపురముఁ బ్రవేశించి ప్రణయము నెఱపుచున్నది.

కుంతి:- విష్ణుసేనుఁ డవిమారకుం డెట్లయ్యెను?

భూతి:- దేవ! అవధరింపుఁడు. ధూమ కేతు వనురాక్షసుఁ డొకఁడు కలఁడు. ఆదురాత్ముఁడు సర్వలోకమారణముకొఱకు సంచరించుచు నొకానొకప్పు డవిరూపముఁ దాల్చి సౌవీర రాష్ట్రమును నిర్మూలనము జేయుట కై సంకల్పించెను.

కుంతి:- ఈ కథ యపూర్వముగా నున్న దే. తర్వాత తర్వాత?

భూతి:- తరువాత స్వదేశమందలి సమస్త ప్రజల యార్తిం జూచియు నారాక్షసుని దౌర్జన్యమునకుఁ బ్రతిక్రియ గనుంగొనలేకయు, సౌవీర వల్లభుఁడు క్లేశపరవశుఁ డయ్యెను.

కుంతి:- తర్వాత తర్వాత?

భూతి:- అనంతర మదియెల్ల నెఱిఁగి కుమారవిష్ణుసేనుఁడు తోడిబాలకులతో నాడుకొనుచు క్షితిరేణుపరుషగాత్రుఁడై జాల్పము లల్లల నాడ నంగరక్షకు లైన పురుషులు ప్రమత్తులైన సమయమున దైవయోగంబున రాక్షసుఁడెప్పట నుండెనో యచ్చోటికిఁబోయెను.

కుంతి:- ఆహా! ఆశ్చర్య మాశ్చర్యము. తర్వాత తర్వాత?

భూతిక:- అంతట నారాక్షసుడు రాజకుమారుం జూచి సుసంపన్నమైన యాహారము తనకు లభించిన దని పరమప్రీతినొంది తనదుష్కర్మ నారంభించెను.

కుంతి:- అబ్బ! ఏమి రాక్షసుని నృశంసత. తరువాత తరువాత?

భూతి:- అనంతర మారాజకుమారుఁడు మందహాసము జేసి కవియ -

తే. గీ. *కొండ వజ్రపాతంబునఁ గూలునట్లు*
కాఱుచిచ్చున గహనంబు గాలునట్లు
లాయుధసహాయహీనుఁ డౌ నతనిచేత
నీచరాక్షసుఁ డంతట నేలఁ గూలె.

కుంతి:- ఇతఁడు దేవసంజాతుఁడు గాని, కేవలమనుష్యుఁడై యుండఁడని నాఁడు హస్తి సంభ్రమసమయంబుననే నే నంటిని.

సౌవీ:- రాజ! నీవు చారుల వలన స హస్రనేత్రుఁడవు. అవిమారకునిఁ గూర్చి యేమి యాలోచించితివి?

భూతి - స్వామి!

తే. గీ. *వెళ్ళ వలసిన దేశముల్ వెళ్ళినారు*
వారు, లెందుఁ గన్పడ లేదు వారి కతఁడు
మనుజనాయక! నీపట్టి మాయ మయ్యె
ననుచుఁ బరిశీలనము సేయ నాత్మఁదోఁచె.

(అప్పుడు నారదుఁడు ప్రవేశించుచున్నాఁడు)

నార -

ఉ. *వేయుదుఁ బ్రీతచిత్తు సరసీరుహసంభవుఁ బ్రత్యహంబు స్వా*
ధ్యాయముచేత, గీతముల నమ్మతు నుద్ధతరోమహర్షణుం
జేయుదు, ధారుణిం గలహసృష్టిని సుస్వరసృష్టి తంత్రులం
బాయకఁ జేయుచుండుదు నుపాయపరంపర వన్ని నేర్పుతోన్.

ఒహో! కుంతిభోజుని తండ్రి యైన దుర్యోధనునిచేత మేము చిరకాల మూరాధింపఁ బడితిమి. అతఁడు పరలోకమున కరిగినతరువాత కుంతిభోజుఁడు మాయెడ భృత్యభావమే దాల్చి యున్నాఁడు. నేఁడవిమారకుఁడు కనఁబడకపోవుటచేఁ గుంతి భోజునకు సౌవీర రాజునకు గొప్ప మనస్సంకటము కల్గుచున్నది. నేనిప్పు డవిమారకునిఁ జూపి వారి మనస్సంకటమును బాపఁదలఁచి భూలోకమునకు దిగితిని కదా!

(అని కుంతిభోజసౌవీర రాజులయెదుట నిలుచు చున్నాఁడు.)

కుంతి – అహో! భగవానుఁ డైన దేవర్షి నారదులు దయ చేసినారే. భగవానుఁడ! అభివాదము చేయుచున్నాను.

నార – నీకు శుభ మగుఁగాక!

కుంతి – నే నను గ్రహింపఁబడితిని.

సౌవీ – భగ వానుఁడ! అభివాదము చేయుచున్నాను.

నార – నీకు శాంతి యగుఁగాక!

సౌవీ – నే ననుగ్రహింపఁబడితిని.

కుంతి – (చెవిలో) భూతిక! యిట్లు చేయుము.

భూతి – దేవ! చిత్తము (నిష్క్రమించి, ప్రవేశించి) ఇదిగో అర్ఘ్యపాద్యములు.

కుంతి – దేవ! అనుగ్రహించి యర్ఘ్యపాద్యములు గ్రహింపుఁడు

నార – అట్లె యగుఁగాక!

కుంతి – (అర్పించి) దేవా! మీయవతరణము చేతనాగృహము పావన మైనది.

సౌవీ – దేవర్షి దర్శనము చేత నా కిప్పుడు శాపవిమోచన మైనది.

నార – నే నిప్పుడు నీదర్శనార్థమే రాలేదు. అవిమారకుఁడు కనఁబడక పోవుటవలన మీకుఁ గలిగిన దుఃఖముఁ దెలిసి వచ్చితిని.

ఉభయులు – అట్లైన మేము సంతాపవిముక్తుల మైతిమి.

నార – భూతిక! సుదర్శనా దేవిం దీసికొనిరా.

భూతి – చిత్తము దేవ! (అని నిష్క్రమించి సుదర్శనతో మరలఁ బ్రవేశించును.)

సుదర్శ - ఓహో! దేవర్షి దయచేసెనే.

భూతి - ఔ నాలాగె.

సుద - నాపుత్రకుని వివాహ మిప్పుడు సనాథ మైనది. (సమీపించి) దేవ! నమస్కారము.

నార -

తే. గీ. *ఓమహాభాగురాల! నీ వొందు మమ్మ*
యీ తెఱంగున నిత్యంబుఁ బ్రీతిశతము
కుంతిభోజుండు, సౌవీరకుతలపతియుఁ
బ్రీతిపీడితు లౌదురుగాత సతము.

సుద - నే ననుగ్రహింపఁబడితిని.

నార - అయ్యా! అడుగవలసిన దేదైన నుండిన పక్షమున నన్నిప్పు డడుగుఁడు.

ఉభయులు - మే మిద్దఱ మనుగ్రహింపఁబడితిమి.

కుంతి - మహాత్మ! సౌవీర రాజపుత్రుఁడు జీవించియున్నాఁడా?

నార - ఆహా.

సౌవీ - ఎందుచేతఁ గనఁబడఁడు?

నార - పెండ్లి తొందరచేత.

సౌవీ - ఏమీ! కుమారునకు వివాహమ్మైనదా?

కుంతి - ఏప్రదేశమందు?

నార - వైరంత్యనగరమునందు.

కుంతి - వైరంత్యమను పేరుగల నగర మున్నదా? సరె! యెవ నియల్లుఁ డైనాఁ డతఁడు?

నార - కుంతిభోజునికి

కుంతి - అతఁ డెవఁడు?

నార -

తే. గీ. *అతఁడు తండ్రి కురంగికి, క్షితివిభుండు*
బ్రథిత వైరంత్య పట్టణ వల్లభుండు

నందనుండు దుర్యోధన నరవరునకు
కుంతిభోజుఁ డాతఁడ వీవ కువలయేశ.

కుంతి – ఇన్ని ప్రశ్న లెందునకు. నాపుత్రి యైన కురంగి యందు నిర్విష్టుఁడైనాఁడని యా దేవర వారు సెలవిచ్చుచున్నారు.

నార – ఔ నట్లే –

కుంతి – నేను సిగ్గుపడుచున్నాను. కన్య నిచ్చిన వా రెవ్వరు? కన్యాంతఃపుర మతఁడెట్లు ప్రవేశింపఁగలిగెను?

నార –

తే. గీ. *ఎవ్వ రిచ్చెనో యన నేల యిచ్చె బ్రహ్మ*
చూడఁబడె నామె మదగజక్షోభవేళఁ
బౌరుషంబున మును పిప్పు ప్రబలమాయె
నంతిపురిఁ జొచ్చి నాఁడాతఁ డక్కజముగ.

కుంతి – అట్లగుఁగాక! అట్లేయుండవచ్చును. ఋషివచనము నిష్ప్రతి వచనము. మహాత్మ! కురంగికిని సౌవీర రాజకుమారునకును వివాహకాలము వచ్చినదా? ప్రయత్నములు సేయఁదగునా?

నార – జరుగవలసిన సమయమున వా రిరువురకు గాంధర్వ వివాహ మిదివఱకే జరిగినది.

కుంతి – అగ్ని సాక్షికముగా వివాహము చేయఁగోరుచున్నాఁడను.

నార – అగ్ని నిత్యసాక్షియె. ఐనను స్వజనపరితోషణార్థ మభ్యంతర మందిరమున సముదాచారముమాత్ర ముపాధ్యాయుని చేత నడిపించి భార్యాసమేతముగాఁ గుమారవిష్ణు సేను నిక్కడికి శీఘ్రముగ రావింపుము.

కుంతి – మహాత్మ! యిదె వెళ్లుచున్నాను.

నార – నీవుండు. భూతికి! నీవు వెళ్ళు

భూతి – భగవానుఁడా జ్ఞాపించినట్లు చేసెద. (నిష్క్రమించును)

కుంతి – దేవ! దేవరవారితో మనవిచేసికొనవలసిన విషయ మొకటి యున్నది.

నార – ఇటురా! యథేచ్ఛముగాఁ జెప్పుము.

కుంతి – దేవ! సుదర్శనాపుత్రుఁడైన జయవర్మకుఁ గురంగి నిచ్చెద నని మాటయిచ్చి యామె నిటకు భర్తృసమేతముగాఁ దోడి తెచ్చితిని. ఇప్పు డేమి సేయవలయు నని దేవరవారు సెలవిచ్చెదరు?

నార – ఇట్లు చేయుదము. ఒక్క నిముస మేకాంతముగ నుండుడు

కుంతి – అట్లే చేయుదును. (అవలకుఁ బోవుచున్నాఁడు)

నార – సుదర్శన! యిటురా

సుద – దేవ! యిదె వచ్చితిని.

నార – నామాటలు విన్నావుగదా!

సుద – సౌవీర రాజకుమారుని యొక్క గుణ సంకీర్తనము విన్నాను

నార – అట్లుకాదు. నీవు మఱచితివి కాఁబోలు! అగ్ని దేవుని ప్రసాదమువల్ల నీ వొకకుమారునిఁగంటివి. అతఁడే నీ జ్యేష్ఠపుత్రుఁడు

సుద – అమ్మో! అది దేవర వారికిఁ దెలిసినదా?

నార – తెలియ కేమి? నాయాజ్ఞాప్రకారము జేయుము

సుద – అట్లే చేయుదును. సెల వియ్యండి.

నార – ఈ కుమారుఁడు నీ కగ్ని వలన జన్మించినాఁడు. నీ సోదరియైనసు చేతన కూడఁ దత్సమయమంది ప్రసవ మయ్యెను. ఆమె కన్న మగ శిశువు పుట్టిన తోడనే మృతినొందెను. అప్పుడు నీవు కన్న యీపుత్రుని నీసోదరి కిచ్చితివి. సౌవీర రాజును మిక్కిలి సంతుష్టుఁడై ప్రీతిసదృశములైన క్రియ లొనరించి విష్ణుసేనుఁడను పేరుపెట్టెను. అమానుషస్వ రూప బలపరాక్రమ వీర్యములు గలిగి వర్ధమానుఁడైన యాకుమారునిచేత నవిరూపధారి యైన రాక్షసుఁ డొకఁడు సంహరింపఁ బడుట చేత లోకమీతని కవిమారకుఁ డని పేరు పెట్టెను. అనంతర మతఁడు బ్రహ్మర్షి శాపవశంబునం దిరుగుచు గజ సంభ్ర మదివసంబునఁ గురంగిం జూచి సముద్ధమదనాభిలాషుఁడై యత్యంత పౌరుషము చేత సమీపించి కురంగి నతఁడు చూచుటచేత శంకించి కన్యా పురరక్షకులు పరీక్షింపఁగా మహానుభావుఁ డైనయగ్ని దేవుని ప్రభావంబున నతఁడు వారిచేఁ బట్టువడక వెడలి పోయెను. అనిర్వేదముచేత నతఁ డగ్నిం

ప్రవేశించి తండ్రియైన యగ్ని దేవునిచేతఁ బ్రేమమీఱఁగౌఁగలింపం బడి యగ్ని తన్ను దహింపలే దని మరుత్ప్రపాతము సేయఁ దలఁచి యొకా నొక పర్వత మెక్కెను.

సుద – అయ్యో! అత్యాహితమె.

నార – అచ్చట నొకానొక విద్యాధరుఁడు తద్రూపసందర్శన మాత్రముననే సంతసించి ప్రీతిచేత నంతర్ధాన కార్య మాత్ర మైన యంగుళీయకముఁ బ్రసాదించెను. అది కుడుచేతిని దాల్చినా యదృశ్యుఁ డగును. ఎడమచేతఁ బెట్టికొనెనా యెప్పటివలె నుండును.

సుద – ఆశ్చర్య మాశ్చర్యము.

నార:– తరువాత నతఁడా యుంగరము కుడిచేతఁదాల్చి సంతుష్టుఁడను పేరు గల బ్రాహ్మణునితోఁ గలిసి కుంతిభోజుని కన్యాంతఃపురము తన గృహంబువలెఁ బ్రవేశించి కురంగితో యథేష్టముగా నభిరమించి సుఖంబున నుండెను. ఇది వృత్తాంతము. ఇప్పు డేమిచేయఁ దగును?

సుద – పడుచుపిల్ల యీ విధముగా వంచింపఁబడినందుకు నాహృదయము చలించుచున్నది కాని సంతోషము కూడ నన్నుఁ గ్రమ్ముచున్నది. దేవ! యీదినములలో మాకురంగి జయవర్మకుం భార్య యగు నని తలంచితిని కాని యామె యిప్పుడు జయవర్మకు వదినె యై వందనీయురాలైనది.

నార:– నీవు చెప్పినమాట సత్కులజాతుల కుచిత మైనది. జ్యేష్ఠుని భార్య కనిష్ఠున కెట్లీయఁబడును. సుదర్శన! కురంగి జయవర్మ కంటె వయసునఁ బెద్ద దని కాశి రాజుతోఁ జెప్పు. కురంగిచెల్లెలు సుమిత్ర యనుపిల్ల కలదు గదా! ఆమె జయవర్మ భార్య కాఁగలదు.

సుద – మహర్షివచనము ప్రతిగ్రహించితిని.

నార:– కుంతి భోజు ననుసరింపుము.

సుద – దేవ! చిత్తము.

(అప్పుడు గురంగియు భూతికుఁడును వెంటఁరాగా పెండ్లికొడుకు వేషముతోఁ నవిమారకుఁడు ప్రవేశించు చున్నాఁడు.)

అవి:- అహో! నే నీవృత్తాంతము చేత సిగ్గుపడుచున్నట్లున్నాను.

తే. గీ. *హస్తి సంభ్రమ సమయంబునందు నాఁడు*
నన్నుఁ గని నా తెగువ మెచ్చికొన్న జనులు
నేఁటివృత్తాంతమును విని నీచుఁ డనుచు
దోషమారోపణము జేసి దూరకుంద్రె. 15

(నడచిచూచి) అహో! భగవానుఁడైన నారదుఁడు వచ్చియున్నాఁడె. ఇతఁడు -

తే. గీ. *నిగ్రహానుగ్రహంబుల నిరవధికుఁడు*
ఆగమములందు గీతంబులందు ప్రోడ
స్నిగ్ధములయందు వైరముల్ సృష్టి జేసి
చతురమతి నష్టకార్యముల్ చక్కఁ జేయు. 16

కుంతి:- కుమారా! ఇటు యిటు. మనకుల దైవత మైన దేవర్షికి నమస్కారము చేయుము.

అవి:- దేవ! నమస్కారము.

నార - సహపత్నీకముగ మీకు జయ మగుఁగాక!

అవి:- అనుగ్రహింపఁబడితిని. మామ! అభివాదము చేయుచున్నాను.

కుంతి:- వత్స! యిటు రమ్ము. రమ్ము.

క. *క్షమచే గెలువుము విప్రుల*
నమితంబగుకరుణచేత నాశ్రితులను దే
జముచే శత్రున్నపాలుర
నమితజ్ఞానంబుచేత నాత్మ గెలువుమీ. 17

అవి:- అనుగ్రహింపఁబడితిని.

కుంతి - వత్స! యిటురా. తండ్రి కభివాదము చేయుము.

అవి:-ఓతండ్రి! అభివాదము చేయుచున్నాను.

సావీ:- వత్స! రమ్ము రమ్ము

తే. గీ. *నిబిడనర వేషమున దర్శనీయుఁడ వయి*
గురునమస్కారశుభ్రవక్తుఁడవు నైన
ఈవు నానంద బాష్పపూర్ణేక్షణములఁ
జూచెదవుగాక మావలె సుతునిఁ బ్రియుని. 18

కుమారా! మామగారికి సమస్కారము చేయుము.

అవిమా:- మాతుల! అభివాదముచేయుచున్నాను.

కుంతి:- వత్స! రమ్ము రమ్ము

మ. *హరితుల్యుండవు కమ్ము నిత్యము మహాయజ్ఞంబులం జేసి స*
త్వరతిం బంక్తిర థక్షమావిభునిసామ్యం బొంది; వర్ధిల్లుమీ
నిరత స్ఫూర్జితసంప్రదానములచే నిర్నిద్ర తేజంబుచేఁ
జిరకీర్తిం గను తండ్రికిన్ సముఁడవై చింతావిహీనుండవై. 19

సావీ - కుమార! సుదర్శనునకు నమస్కారము జేయుము.

కుంతి:- సుచేతనకు ముందుగా నమస్కారము చేయక సుదర్శనున కభివాదము చేయుట యనుచితము గదా.

నార:- ఇటు చేయుటకుఁ గారణ మున్నది. సుదర్శన కే ముందుగా నమస్కారము చేయుము.

ఉభయులు - అట్లే చేయుము.

అవి:- అమ్మ! నమస్కారము.

సుద - పుత్ర!యీ మెతోఁగూడి చిరంజీవివి కమ్ము (కౌఁగిలించుకొని) చిరకాలమునకు నిన్నుఁ జూడఁగలిగితిని. నేనిప్పుడు పుత్రసంపత్తిరస మనుభవించుచున్నాను. (అని యేడ్చును)

కుంతి -

తే. గీ. *స్నేహజనిత బాష్పార్ద్ర కుతూహలాక్షి*
ప్రస్రవద్దుగ్ధయుతకు నద్వంద్వయు నగు
నీతరుణివిష్ణుసేనునిమాత యనుమ
నలసుచేతన దాదియే యనుచుఁ దోఁచె. 20

నార:- అతిస్నేహము చాలును. సుచేతన యగుసుచేతనయు, సుదర్శన యగు సుదర్శనయు నంతఃపురమున సుఖ ముందురుగాక! సౌవీర రాజ! భార్యతోడను బుత్రులతోడను నీవుఁగూడ నంతఃపురమునకుఁ బొమ్ము.

కుంతి:- దేవరవారు సెల విచ్చినట్ల చేయుదును.

సుద - దేవ! చిత్తము.

నార: - అచిర కాలములోని సౌవీర రాజు స్వదేశమునకుఁ బోవుఁగాక! కాశి రాజగు జయవర్మకు సుమిత్రనిచ్చి వివాహము సేయుము. నీవును సన్నిహితుఁడవు కమ్ము.

కుంతి:- అనుగ్రహింపఁబడితివి.

నార:- కుంతిభోజ! నీ కింక నేమిప్రియము సమకూర్తును?

కుంతి:- దేవర వారు నా యెడ ననుగ్రహింతు రేని నే నింతకంటె నేమి కోరుదును.

తే. గీ. బ్రాహ్మణులకు గోవులకు మేల్పరఁగుఁగాత!

యెల్లప్రజలకు సౌఖ్యంబె యెసఁగుఁ గాత!

నార:- సౌవీర రాజ! యింక నీ కేమిప్రియము సమకూర్తును?

సౌవీ:- దేవరవారు నాయెడఁ బ్రసన్ను లగుదు రేని నేనింతకంటె నేమి కోరుదును.

కడిలియను నల్లచీరను గట్టుకొన్న

యీపుడమి మాన్యపాలకుం డేలుఁగాత?

భరతవాక్యము.

నీరజస్సులై గోవులు నెగడుంగాక

ఎల్ల శత్రుమండలి శమియించుంగాక

ఈవసుంధర యంతయు నేలుంగాక

క్షితిపవర్యుఁడు మా రాజసింహనృపతి.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది షష్ఠాంకము.

****

T.T.D. Religious Publications Series No : [illegible]
Price : Rs. 10/-

ధర్మాన్ని కాపాడండి. ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది

తిరుమల తిరుపతి దేవస్థానములు

Printed and Published by Sri A.P.V.N. Sarma, I.A.S., Executive officer,
T.T. Devasthanams and Printed at TTD Press, Tirupati.